నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | జులై 24, 2024 | www.navatelangana.com


## కేంద్ర బడ్జెట్‌లో సింగరేణికి మొండిచేయి

నవతెలంగాణ-నస్పూర్

కేంద్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బొగ్గు గని కార్మికులకు ఇన్కమ్ టాక్స్ స్లాబుల పేరిట మొండిచేయి చూపించిందని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టెం లక్ష్మణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నూతనంగా అపాయింట్మెంట్ అయిన కార్మికుల నుండి 15, 20 శాతం ఇన్కమ్ టాక్స్, సీనియర్ కార్మికులకు 30 శాతం కంటే ఎక్కువ ఇన్కమ్ టాక్స్ స్లాబ్‌లో జీతాలు ఉండటంతో సంవత్సరానికి మూడు నుంచి నాలుగు నెలల జీతాలను టాక్స్ రూపంలో కేంద్ర ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. దీనివల్ల ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఎన్నికల ప్రచారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బొగ్గు గని ఉద్యోగులకు పూర్తిగా ఇన్కమ్ టాక్స్ రద్దు చేపిస్తామని, లేకపోతే ఇన్కమ్ టాక్స్ రీయింబర్స్‌మెంట్ ఇప్పిస్తామని హామీలు ఇచ్చి మోసం చేశాయని తెలిపారు.

## పిన్న వయస్సు ఆధార్ కార్డ్ హోల్డర్‌గా ప్రపంచ రికార్డు

నవతెలంగాణ-నస్పూర్



పిన్న వయస్సు ఆధార్ కార్డు హోల్డర్‌గా బేబీ ఐజెల్ ఫాతిమా ప్రపంచ రికార్డ్ సాధించింది. నస్పూర్ మండలంలోని నస్పూర్ కాలనీకి చెందిన మహమ్మద్ అఫ్జల్ పాషా, సమీరా తబస్సుమ్ కూతురు 40 రోజుల వయస్సు(21ఫిబ్రవరి 2024) ఐజల్ ఫాతిమా ఆధార్ నెంబర్, పాన్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ కోసం చిన్న వయసులోనే అప్లై చేసి సాధించింది. ఇంతకుముందు నిజామాబాద్‌కు చెందిన 43 రోజుల బేబీ ఆధ్య రికార్డును బద్దలు కొట్టింది. దీంతో ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పింది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

# నిరాశపర్చిన నిర్మలమ్మ పద్దు..!

- సీసీఐ ఊసులేదు..రైల్వేలైన్‌పై మాట లేదు
- ఇప్పట్లో దరిచేరని విమానయోగం
- కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు తీవ్ర అన్యాయం
- మండిపడుతున్న వివిధ పార్టీల నాయకులు



**కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉమ్మడి జిల్లావాసులను తీవ్ర నిరాశకు గురిచేసింది. మంగళవారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు కనిపించలేదు. ఏటా మాదిరిగా ఈ ఏడాది సైతం అదే అసంతృప్తికి గురిచేసింది. మూతపడిన సీసీఐ పరిశ్రమతో పాటు ఏండ్లుగా నానుతున్న ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వేలైన్ నిర్మాణానికి సంబంధించి ఎలాంటి నిధులు కేటాయించలేదు. మరోపక్క ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో విమానశ్రయ నిర్మాణాన్ని సైతం తాజా బడ్జెట్‌లో పట్టించుకోలేదు. వివిధ సంక్షేమ పథకాల అమలు తప్పా.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ప్రత్యేక కేటాయింపులు ఏమీ లేకపోవడంతో తీవ్ర నిరుత్సాహానికి గురవుతున్నారు. కేంద్ర పద్దుపై కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ(ఎం) తదితర పార్టీల నాయకులు మండిపడుతున్నారు. కేంద్రప్రభుత్వం ఎలాంటి కేటాయింపులు చేయకుండా తీవ్రంగా నిరాశ పర్చిందని విమర్శలు సంధిస్తున్నారు.**

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం సైతం కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఎలాంటి కేటాయింపులు దక్కలేదు. ప్రతి ఏటా నిరాశ పర్చిన మాదిరిగానే ఈ ఏడాది సైతం అలాంటి పరిస్థితి ఎదురైంది. ప్రత్యేకంగా ఉమ్మడి జిల్లాకు ఎలాంటి నిధులు కేటాయించలేదు. ముఖ్యంగా ఆదిలాబాద్ ప్రాంతానికి తలమానికంగా ఉన్న సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) మూతపడి ఏండ్లు గడుస్తోంది. ఈ పరిశ్రమను తెరిపించాలని ఆందోళనలు కూడా జరిగాయి. ప్రజాప్రతినిధులు సైతం ఈ పరిశ్రమను తెరిపించే విషయమై పలుమార్లు కేంద్రమంత్రులను కలిశారు. తాజా బడ్జెట్‌లో పరిశ్రమ పున ప్రారంభానికి సంబంధించి ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని అందరూ ఆశగా ఎదురుచూశారు. కానీ కేంద్రప్రభుత్వం నేతల వినతిని ఏమాత్రం పట్టించుకోలేదు. మరోపక్క ఆదిలాబాద్ నుంచి వయా నిర్మల్ మీదుగా రాజధానికి చేరుకునేందుకు అప్పట్లో ఆదిలాబాద్- ఆర్మూర్ రైల్వే మార్గాన్ని నిర్మిస్తామని హామీనిచ్చారు. ప్రస్తుతం ఈ లైనుకు సంబంధించి సర్వే మాత్రం పూర్తయిందని తెలుస్తోంది. కానీ నిర్మాణానికి సంబంధించి ఎలాంటి నిధులు కేటాయించడం లేదు. ప్రతి ఏటా ఉమ్మడి జిల్లావాసులు ఆశగా ఎదురుచూడటం.. కేంద్రం విముఖత చూపించడం వంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ఏడాది సైతం కేంద్ర బడ్జెట్‌లో ఈ లైనును కనీసం పరిగణనలోకి తీసుకోకపోవడంతో మళ్లీ నిరాశ ఎదురవుతోంది. మరోపక్క కాగజ్‌నగర్‌లో అండర్ బ్రిడ్జి నిర్మాణంతో పాటు కాగజ్‌నగర్-సిర్పూర్ మధ్యలో నిర్మిస్తున్న ఓవర్‌బ్రిడ్జి నిర్మాణానికి సైతం నిధులు కేటాయించలేదు. ముఖ్యంగా విమానశ్రయానికి అనువుగా ఉన్న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో విమానయోగం ఉంటుందని అందరూ ఆశపడ్డారు. ఇక్కడ వైమానికదళ శిక్షణ కేంద్రం ఏర్పాటుచేస్తారనే ప్రచారం ఉంది. ఇందుకు భూసేకరణ కోసం రూ.438కోట్లు కేటాయించాలని ప్రతిపాదనలు పంపించారు. కానీ తాజా బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టును సైతం పరిగణనలోకి తీసుకోనట్లు కనిపిస్తోంది. ఇలాంటి కీలకమైన అభివృద్ధి పనులకు కేంద్రప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో ఉమ్మడి జిల్లావాసులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

**దేశ బడ్జెట్ కాదు.. రాజకీయ బడ్జెట్ : జోగు రామన్న, మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు**



కేంద్ర బడ్జెట్లో మరోసారి తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగింది. ఇది దేశ బడ్జెట్ కాదు. రాజకీయ బడ్జెట్. బిఆర్ఎస్ పార్టీ మాత్రమే తెలంగాణ హక్కుల కోసం పోరాడుతుందని మరోసారి రుజువైంది. ఏపీకి రూ.15 వేల కోట్లు, బీహార్‌కు రూ.26 వేల కోట్లు కేటాయించిన కేంద్రం తెలంగాణపై మాత్రం వివక్షత చూపించింది. విద్యావ్యవస్థ, గ్రామాభివద్ధి, పరిశ్రమలపై నీళ్ల చల్లింది. ప్రాంతీయ శక్తి బలంగా ఉంటే మన హక్కులు సాధించగలుగుతాం.

**కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు మొండిచేయి : దర్శనాల మల్లేష్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి**




జిల్లా నుంచి రెండోసారి ఎంపీని గెలపించి ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో నలుగురు ఎమ్మెల్యేలను గెలిపించినా కేంద్రం బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు ఎలాంటి కేటాయింపులు చేయకుండా మొండిచేయి చూపించింది. జిల్లా ప్రజలు ఎదురుచూసిన సీసీఐ పునరుద్ధరణ, విమానశ్రయ నిర్మాణం, ఆదిలాబాద్ నుండి ఆర్మూర్ కు రైల్వే లైన్ మంజూరు వంటి వాటికి నిధులు కేటాయించలేదు. ప్రజల ఆశలు అడియాశలు చేస్తూ కేంద్రం బడ్జెట్లో తీవ్ర నిరాశకు గురిచేసింది. జిల్లా పట్ల బీజేపీ కపట నాటకాన్ని ప్రజలు ఇప్పటికైనా అర్థం చేసుకోవాలి.

**కార్పొరేట్లకు మేలు చేసే బడ్జెట్ : రంగు రాజేశం, ఉద్యోగ సంఘాల నాయకుడు, మంచిర్యాల**



కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలతో పాటు ఉద్యోగ, కార్మిక వర్గాలను సైతం తీవ్ర నిరాశకు గురిచేసింది. మునుపెన్నడూ లేని విధంగా జీఎస్టీ వసూళ్లు సుమారు లక్ష కోట్లకు పైగా దాటిన.. కీలక విద్యా, ఆరోగ్య రంగాలకు నామమాత్రపు కేటాయింపులు చేశారు. "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" కు కట్టుబడి ఉన్నామని ప్రకటించడం ద్వారా.. కార్పొరేట్లకు కొనసాగుతున్న ఊడిగం ఇక ముందు కూడా నడుస్తుందని తెలుపకనే తెలిపినట్టయింది. అన్నదాతలను తీవ్ర నిరాశకు గురి చేస్తూ రైతులకిచ్చే మద్దతు ధరలు ఎలాంటి పెరుగుదల ప్రకటించలేదు. డీజిల్ పెట్రోల్ పై పన్నులు తగ్గించి ఉంటే ప్రజలపై తీవ్ర భారం మోపుతున్న నిత్యావసర వస్తువుల ధరలు తగ్గేవి. ఉద్యోగ వర్గాల స్టాండర్డ్ డిడక్షన్ పరిమితి పెంచడమొక్కటే చెప్పుకోదగ్గ ఉపశమనం. ఆదాయ పన్ను స్లాబ్ రేటు లోనూ నామమాత్రపు తగ్గుదల ఇచ్చారు.

**ఇది పొలిటికల్ బడ్జెట్ : గడ్డం వంశీకృష్ణ, ఎంపీ, పెద్దపల్లి**



బడ్జెట్‌లో నిరుద్యోగులకు మొండి చేయి మిగిలింది. యువత భవితను గాలికి వదిలేసి పూర్తిగా పొలిటికల్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. సాధారణ ప్రజల గురించి ఆలోచించకుండా ప్రవేశపెట్టిన బడ్జెట్ లో తెలంగాణకు అన్యాయం జరిగింది. బీజేపీ పార్టీకి మద్దతు తెలుపుతున్న ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు పెద్ద పీట వేశారు. రైతుల గురించి ఆలోచించకుండా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పూర్తిగా వ్యవసాయ రంగానికి అన్యాయం జరిగింది. తెలంగాణ ప్రజలకు బీజేపీ ఎంపీలు ఇప్పుడు ఏం సమాధానం చెబుతారో చూడాలి. తెలంగాణ కోసం కేంద్రం నుండి పోరాడి నిధులు తీసుకొస్తామని హామీ ఇచ్చారు.

## పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి



నవతెలంగాణ-తాండూర్

విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారి కిరణ్మయి సూచించారు. మంగళవారం కొత్తపెల్లి రైతు వేదికలో రైతులకు శాస్త్రవేత్తలతో అవగాహన కల్పించారు. రాబోవు మూడు రోజులలో తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పంట పొలాల్లో మందులను పిచికారి చేయడం తాత్కాలికంగా వాయిదా వేయాలన్నారు. వర్షాలు తగ్గిన తర్వాత ఎకరాకు 25 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పోటాష్‌ను 20 రోజుల మరియు 40 రోజల వయసున్న పంటకు వేయాలని తెలిపారు. ముంపుకు గురైన పంట త్వరగా కోలుకోవడానికి 19:19:19 లేదా 13-0-45 లేదా 10గ్రాముల యూరియా లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలన్నారు.

## అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం



నవతెలంగాణ-వేమనపల్లి

ఎంపిడిఓ కార్యాలయంలో అభివృద్ధి పనులపై ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో పండ్ల తోటల పెంపకం కోసం లబ్ధిదారులను గుర్తించి, పనులు ప్రారంభించాలన్నారు. సామాజిక తనిఖీ కొరకు రికార్డులు సిద్ధం చేయాలని తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా నాటుతున్న మొక్కల సంరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని, వర్షాలు ఎక్కువగా కురుస్తున్న కారణంగా పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలని తెలిపారు. ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. సమావేశంలో ఏపీవో సత్యప్రసాద్, ఈసీ మధుకర్, సాంకేతిక సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

## లిటిల్ రోబోస్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

లిటిల్ రోబో స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు బచ్చలి ప్రవీణ్ కుమార్, షేక్ సల్మాన్ పాషా డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ లిటిల్ రోబోస్ స్కూల్ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జీవో ఎంఎస్ నెంబర్-1 ప్రకారం కనీస సౌకర్యాలు లేకుండా నడుస్తోందన్నారు. ఫైర్, గ్రౌండ్, గ్రిల్స్, ప్లేగ్రౌండ్ లేకుండా మెయిన్ రోడ్డులో ఇంట్లో స్కూల్‌ను నిర్వహిస్తున్నారన్నారు. స్కూల్లోనే టై, బెల్ట్, స్టేషనరీ అమ్ముతూ విద్యను వ్యాపారం చేస్తూ అర్హత లేని ఉపాధ్యాయులతో విద్యాబోధన చేయిస్తున్నారని తెలిపారు. తక్షణమే అధికారులు స్పందించి స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## గనులను సింగరేణికే కేటాయించాలి

నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి ప్రాంతంలో ఉన్న గనులను వేలం వేయకుండా సింగరేణికే కేటాయించాలని టీబీజీకేఎస్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణకు గుండెకాయ అయిన సింగరేణి సంస్థను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూస్తుందని మండిపడ్డారు. సింగరేణిని కాపాడుకోవాల్సిన బాధ్యత తెలంగాణ ప్రాంత ఎంపీలు, ఎమ్మెల్యేలందరిపై ఉందన్నారు. 2023-24 సంవత్సరానికి వచ్చిన లాభాలను సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం వెంటనే ప్రకటించి కార్మికులకు 35 శాతం లాభాల వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు.

## బీఎంఎస్ ఆవిర్భావ వేడుకలు

నవతెలంగాణ - కాసిపేట



మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇంక్లైన్ గనిపై బీఎంఎస్ 70వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మందమర్రి ఏరియా సెక్రెటరీ గుర్రం ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ బీఎంఎస్ దేశంలోనే ఎక్కువ సభ్యత్వం కలిగిన యూనియన్ అని తెలిపారు. కార్మికులకు ఎల్లవేళలా అండగా ఉండి సమస్యలు తీర్చుతామని, రాబోయే రోజులలో మందమర్రి ఏరియాలో బీఎంఎస్‌ను బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరాజు, కోశాధికారి మాసాల రవీందర్, ఆర్గనైజేషన్ కార్యదర్శి పలకపాటి సంతోష్, శ్రీనివాస్, పిట్ కార్యదర్శి ఆచ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

## పంట నష్టంపై సర్వే చేయించి పరిహారం అందజేస్తాం

- ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

నవతెలంగాణ-జైపూర్



ఎడ్లబండిపై గ్రామాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వివేక్

కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో నష్టపోయిన పంటలను సర్వే చేయించి బాధిత రైతులకు నష్ట పరిహారం ఇప్పిస్తామని ఎమ్మెల్యే వివేక్ హామీ ఇచ్చారు. మంగళవారం కోటపల్లి మండలంలోని అన్నారం, సిర్సా జనగామ, సూపాక, వెంచపల్లి గ్రామాల్లో పర్యటించి పంటలకు జరిగిన నష్టాన్ని పరిశీలించారు. స్థానికంగా కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువన కురుస్తున్న వర్షాలతో పంటలకు జరిగిన నష్టాన్ని సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులను అడిగి తెల్సుకున్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రాణహిత నది ఉప్పొంగి ప్రవహిస్తుండగా, కాళేశ్వరం బ్యాక్ వాటర్ కారణంగా పంటలకు నష్టం జరిగిన తీరును సంబంధిత వ్యవసాయ శాఖ మంత్రితో మాట్లాడినట్లు తెలిపారు. బ్యారేజ్ గేట్లు ఎత్తి ఉంచినా బ్యాక్ వాటర్ పంట పొలాల్లోకి వచ్చి చేరడంతో సంబంధిత శాఖ మంత్రి ద్వారా జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. దేవులవాడలో పర్యటించిన ఆయన నిరంతరాయంగా కురుస్తున్న వర్షాలతో బురదమయమైన రోడ్లను పరిశీలించారు. ఎండ్ల బండి ఎక్కి గ్రామంలో పర్యటించి రోడ్ల పునరుద్ధరణకు రూ. 12లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మెన్ మూల రాజిరెడ్డితో పాటు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రాణహిత ఉధృతిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

## నదీ తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- రామగుండం సీపీ శ్రీనివాస్



నవతెలంగాణ-జైపూర్

నదీ తీర ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రామగుండం సీపీ శ్రీనివాస్ సూచించారు. మంచిర్యాల డీసీపీ భాస్కర్, డీసీపీ(అడ్మిన్) రాజు, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లుతో కలిసి మంగళవారం అంతర్రాష్ట్ర సరిహద్దు సిరొంచ వంతెన, అర్జున్‌గుట్ట ఫెర్రి పాయింట్ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారీగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో సరిహద్దు గ్రామాల వారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గ్రామీణులకు ఎలాంటి సహాయ సహకారాలు అవసరమున్నాయో తెలుసుకొని చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఆస్థి, ప్రాణ నష్టం జరుగకుండా శిక్షణ పొందిన సిబ్బందితో పాటు వాటర్ బోటు వివిధ రక్షణ పరికరాలతో కూడిన డీడీఆర్ఎఫ్(డిస్టిక్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) అందుబాటులో ఉంటుందని తెలిపారు. సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే 100 నెంబర్‌కు డయల్ చేసి పోలీసుల సహకారం పొందాలని కోరారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, ఉధృతంగా ప్రవహిస్తున్న నదులను, పొంగిపొర్లుతున్న జలపాతాలను, వాగులు, వంకలు చూడటం కోసం బయటకు వచ్చి ప్రమాదాల బారిన పడవద్దని గ్రామీణులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, నీల్వాయి ఎస్సై శ్యామ్‌పటేల్ పాల్గొన్నారు.

## సర్వీస్ రూల్స్ సాధించి తీరుతాం : ఇన్నారెడ్డి




నవతెలంగాణ-మంచిర్యాల

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్‌ని సాధించి తీరుతామని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షులు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి అన్నారు. మంగళవారం సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల ప్రభుత్వ పాఠశాలలో సభ్యత్వ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధన ద్వారా అర్హులైన స్కూల్ అసిస్టెంట్‌లకు ఎంఈఓ, డిప్యూటీ డిఇఓ, జూనియర్ లెక్చరర్, డైట్ లెక్చరర్‌గా ఉద్యోగోన్నతులకు మార్గం సుగమం అవుతుందన్నారు. దీని కోసం సీఎం రేవంత్‌రెడ్డితో సంఘ నాయకులు సంప్రదించారని, సీఎం సూచన మేరకు ఉమ్మడి సర్వీస్ రూల్స్‌కి సంబంధించిన నివేదికను సీఎమ్ఓ అధికారి మాణిక్‌రావుకు అందజేశామని తెలిపారు. రిలీవ్ కాకుండా ఆగిపోయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయించడానికి కృషి చేస్తామని తెలిపారు. బదిలీలలో భాగంగా వెబ్ ఆప్షన్‌లో జరిగిన పొరపాట్లను 15 రోజుల్లోగా పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలని, మేనిఫెస్టోలో పెట్టిన విధంగా సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వానికి విన్నవించామని తెలిపారు. 317 జీవో వల్ల నష్టపోయిన ఉపాధ్యాయులకు స్థానికత ఆధారంగా వారి స్థానిక జిల్లాలకు కేటాయించే విధంగా పనులు జరుగుతున్నాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను ఇచ్చి 50శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఉపాధ్యాయ మాసపత్రిక సంపాదకవర్గ సభ్యులు రాసపల్లి రవి, ప్రధానోపాధ్యాయురాలు సుధ, పద్మజ, జ్యోతి, వెంకన్న, బాపురావు, ఉదయ్, అంకతి మల్లేష్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



నుజ్జునుజ్జు అయిన కారు, మృతి చెందిన అజయ్

నవతెలంగాణ-జైపూర్

ఇందారం సమీపంలో గల దాబా హోటల్ వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మచ్చ అజయ్(24) మృతి చెందినట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..మెట్‌పల్లిలోని హుందాయి కార్ షోరూమ్‌లో టెక్నీషియన్‌గా పని చేస్తున్న అజయ్ సోమవారం రాత్రి విధులు ముగించుకుని కారు(నెం టీఎస్21ఎల్ 1113)లో వస్తుండగా ప్రమాదం జరిగింది. మెట్‌పల్లి నుండి మంచిర్యాల మీదుగా స్వగ్రామమైన మైదంబండ గ్రామానికి వెళ్తుండగా ఇందారం సమీపంలో ఎలాంటి హెచ్చరికలు, పార్కింగ్ లైట్స్ లేకుండా నిలిపి ఉన్న లారీ(నెం ఏపీ01వై 0224 వెనుక భాగాన్ని ఢీకొట్టాడు. దీంతో అజయ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తండ్రి మచ్చ లక్ష్మన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మొక్కలు నాటి నీరు పోశారు. సిబ్బంది సైతం పలు మొక్కలను నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఓ సాధన, జిల్లా మలేరియా అధికారి శ్రీధర్, డా.గజానన్, ఎన్‌హెచ్‌ఎం కార్యక్రమాధికారి అనిల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



## కేటీఆర్‌ను కలిసిన బోథ్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-నేరడిగొండ

అసెంబ్లీ సమావేశాల అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మంగళవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బోథ్ నియోజకవర్గంలోని పలు సమస్యలను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వెంట నేరడిగొండ మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ జడ్పీటీసీ జహీర్, వీడీసీ చైర్మెన్ రవీందర్‌రెడ్డి, నాయకులు రాహుల్ ముండే, సురేందర్ ఉన్నారు.



## కుంగిన మర్రివాగు అప్రోచ్‌రోడ్డు



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మర్రివాగు బ్రిడ్జిని ఆనుకొని ఉన్న అప్రోచ్‌రోడ్డు వర్షాలకు కుంగిపోయింది. దీంతో అటుగా వెళ్లె ప్రయాణికులు, ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం ఆటో కూడా వెళ్లలేని పరిస్థితి ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంకోలి గ్రామస్తులు వ్యవసాయ పనులకు వెళ్లాలంటే ఎడ్లబండిని తీసుకెళ్లలేక పోతున్నామని పేర్కొన్నారు. అంకోలి చించుఘాట్ రహదారి మధ్యలో మర్రివాగుపై ఈ బ్రిడ్జి ఉందని అన్నారు. బ్రిడ్జి సమయంలో కాంట్రాక్టర్ అప్రోచ్‌రోడ్డును నాసిరకంగా నిర్మించారని గ్రామస్తులు పేర్కొన్నారు. వాగు ప్రవాహానికి అప్రోచ్‌రోడ్డు కుంగిపోయిందని తెలిపారు. ఈ రహదారికి గుండా సిరికొండ, మాలే బోరుగాం, చినమాలే బోరిగం, దారిలొద్ది, బండగూడ, పొట్టం లొద్ది, దివ్యగూడ, గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఆటంకంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

## బ్యాంకర్లు రైతులను ఇబ్బంది పెట్టొద్దు

నవతెలంగాణ-సిరికొండ

రైతులకు రుణమాఫీ చేశామని, బ్యాంకర్లు రైతులను ఇబ్బంది పెట్టవద్దని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామీణ బ్యాంక్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా బ్యాంకులో రైతు రుణమాఫీ ప్రక్రియ గురించి ఆమె అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొదటి విడతలో లక్ష రూపాయల రుణమాఫీ చేశామని, రైతుల ఖాతాల్లో జమ చేయాలని అధికారులకు సూచించారు. రుణమాఫీ విషయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులకు గురి చేయొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంజాన్, ప్రవీణ్, లక్ష్మణ్, ఇమామ్, దత్తు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-కుభీర్

మండల కేంద్రంలో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను మంగళవారం ముధోల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కిరణ కొమ్రేవార్ పరామర్శించారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్తలు బడేమియ్య, కండక్టర్ బోయిడి రాజేశ్వర్ ఇటీవల వివిధ కారణాలతో మరణించారు. విషయం తెలుసుకున్న ఆయన బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎన్నిల అనిల్‌తో కలిసి పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు ఆయన వెంట పుప్పాల పీరాజి, దేవిదాస్, కందురు దత్తు, బాబు, పొగుల పోతన్న, కాశినాథ్, గణేష్ ఉన్నారు.

## కాలుష్య నివారణకు మొక్కలు నాటాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాలుష్యం లేని వాతావరణం కోసం ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన పేర్కొన్నారు. మంగళవారం ఈచ్ వన్ ప్లాంట్ వన్ కార్యక్రమంలో భాగంగా డిపో ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీఎం మొక్కలు నాటి నీరు పోశారు. టెక్నాలజీ ద్వారా ఎన్నో కంపెనీలు వస్తువుల సేవల ఉత్పత్తి చేయడం ద్వారా కాలుష్యం కూడా ఏర్పడుతుందన్నారు. పర్యావరణం కాపాడుకోవడం మన అందరి బాధ్యత అన్నారు. మొక్కలు నాటి ఆరోగ్య పరిరక్షణ కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది ఉన్నారు.

## విద్యుద్ఘాతానికి గురై గేదె మృత్యువాత

నవతెలంగాణ-కడెం

విద్యుద్ఘాతానికి గురై గేదె మృత్యువాత పడ్డ సంఘటన మండలంలోని లింగాపూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన దేశెట్టి చిన్న రాజన్నకు చెందిన గేదె మేతకు వెళ్లి సాయంత్రం సమయంలో ఇంటికి వస్తున్న క్రమంలో లింగాపూర్‌లోని రైస్‌మిల్ ప్రక్కన గల ట్రాన్స్‌ఫార్మర్ వైరు తగిలి గేదె అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు. గేదె విలువ సుమారుగా రూ.60 వేల వరకు ఉంటుందని బాధితుడు పేర్కొన్నారు. తన జీవనోపాధి అయిన గేదె చనిపోవడంతో తనకు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో ఈనెల 25న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విశ్రాంత ఉద్యోగులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మారెడ్డి, కిష్టయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఈ శిబిరానికి హాజరు కావాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని జీన్‌గూడకు చెందిన సయ్యద్ అజం మంగళవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్ వారి కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆర్థిక సాయం అందించిన వారిలో షేక్ దస్తగిర్, షేక్ దాదే అలీ, జాకిరుల్లాఖాన్, ఫేరోజ్ ఖాన్, కరీంఖాన్, గోవింద్, సయ్యద్ ఖాసిం, కోర్రల మహేందర్, షేక్ హుస్సేన్, బసిర్, హాసన్ ఖాన్, అల్లంఖాన్, మహమ్మద్ ఖురేషి, మన్సూర్ ఖాన్ ఉన్నారు.

## యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడి బరిలో సాయి చరణ్‌గౌడ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 5 నుంచి అక్టోబర్ 5 వరకు ఆన్‌లైన్ ద్వారా నిర్వహించే, యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో భాగంగా జిల్లా అధ్యక్షుడి బరిలో సాయి చరణ్‌గౌడ్ పోటీలో ఉంటున్నట్టు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గడుపులోగా తన మెజార్టీని సాధించి, జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక అయ్యేందుకు మంగళవారం ఆన్లైన్ ద్వారా నామినేషన్ దాఖలు చేశానని తెలిపారు. 35 సంవత్సరాలలోపు వారు తమ ఓటింగ్‌లో పాల్గొని ప్రత్యేక యాప్ ద్వారా ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు.

**జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బరిలో నాగరాజు...**

రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 5 నుంచి అక్టోబర్ 5 వరకు ఆన్‌లైన్ ద్వారా నిర్వహించే యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో భాగంగా ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బరిలో జిల్లాకు చెందిన నాగరాజు వేముల పోటీ చేస్తున్నట్టు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గడుపులోగా తన మెజార్టీని సాధించి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నిక అయ్యేందుకు మంగళవారం ఆన్‌లైన్ ద్వారా నామినేషన్ దాఖలు చేశాని తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాలలోపు యువతీ, యువకులు వారు ఐవైసీ యాప్ ద్వారా ఆన్‌లైన్ ఓటింగ్‌లో పాల్గొని, తనకు మద్దతు తెలపాలని కోరారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-నార్నూర్

ప్రజలు వర్షాకాల సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. మంగళవారం గాదిగూడ మండలంలో పర్యటించారు. ఝరి ప్రభుత్వాస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రిలో వైద్య సిబ్బంది వివరాలు తెలుసుకొని, హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేసి, మందుల స్టాక్‌ను పరిశీలించారు. గర్భిణులతో పాటు వైద్యం అందిస్తున్న రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని, వంద శాతం గర్భిణీలు ప్రభుత్వాస్పత్రిలోనే ప్రసవాలు జరిగేలా చూడాలని వైద్యాధికారిని ఆదేశించారు. పర్సవాడ(కే) ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. గర్భిణీ, బాలింతలకు రోజు వారి ప్రణాళిక ప్రకారం బాలామృతం, పాలు గుడ్లు సరఫరా చేయాలనీ అంగన్‌వాడీ టీచర్‌కు సూచించారు. మండలంలోని ఆర్జుని గ్రామపంచాయతీ పరిధిలోని మారుగూడ, ధర్మగూడ, పెద్దవాగు కల్వర్టును పరిశీలించారు. వర్షాకాలం నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బంది లేకుండా జాగ్రతలు పాటించాలని అన్నారు. రేషన్ నిత్యావసర సరుకులు ముందస్తు సహాయక చర్యలు తీసుకోవాలని అన్నారు. రోడ్లు మరమ్మతు పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మండలంలోని ధాబా(కే) గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సూచించారు. వారి వెంట డీపీఆర్వో బాదావత్ తిరుమల, ఎంపీడీఓ రమేష్, తహసీల్దార్ విజయానందం, ఏంఈఓ ఆశన్న, వైద్యాధికారి సంజీవ్, ఎస్సై మహేష్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

# కాంగ్రెస్ మోసాలను తిప్పికొట్టాలి

- మాజీ మంత్రి జోగు రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని తిప్పికొట్టాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి చర్చ వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ రుణమాఫీలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మరో పక్క కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకాలు నిర్వహించడం హాస్యాస్పదం అన్నారు. రైతులకు అందించాల్సిన రుణమాఫీలో రాష్ట్ర ప్రభుత్వం ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తుందని మండిపడ్డారు. గ్రామాల్లో రైతులు రుణమాఫీ విషయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను రైతులు తమ దృష్టికి తీసుకురావడం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, రైతులు ఎదుర్కొనే ఇబ్బందుల పట్ల వారితో అండగా ఉంటూ వారి సమస్యలను అప్రమత్తం చేయాలని సూచించారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం రూ.లక్ష కూడా మాఫీ చేయడంలో విఫలమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస అవగాహన లేకుండా బ్యాంకుల నుంచి తప్పుడు లెక్కలు తీసుకొని రైతులను ఇబ్బందికి గురి చేస్తుందన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం బేషరతుగా రెండు లక్షల మాఫీచెయ్యని యెడల, రైతుల పక్షాన బీఆర్ఎస్ నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రోకండ్ల రమేష్, మార్శెట్టి గోవర్ధన్, గంద్రత్ రమేష్, లింగారెడ్డి, మెట్టు ప్రహ్లాద్, యాసం నర్సింగరావు, సేవ్వా జగదీష్, వేణుగోపాల్ యాదవ్, భోజన్న పాల్గొన్నారు.

# రోడ్డు అధ్వానంగా మారినా పట్టించుకోరా..?



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని టైలర్స్ కాలనీకి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారిన పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోయారు. మంగళవారం గ్రీన్ సిటీ, టైలర్స్ కాలనీకి చెందిన ప్రజలు రహదారిపై నిరసన తెలిపి రోడ్డుకు మరమ్మత్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు అయ్యన్న, సంజయ్ మాట్లాడుతూ ఈ రహదారి గుండానే తలమడుగు మండలం కజ్జర్ల, పల్సి(బి), ఝరిపూనగూడకు బస్సులతో పాటు ఇతర వాహనాలతో ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. అధికారులకు పలుమార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని తెలిపారు. ఐదేండ్ల నుంచి ప్రతి సంవత్సరం వర్షకాలంలో తమకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు పడి అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ రహదారి గుండానే బస్సులు, ఆటోలు, టిప్పర్లు, స్కూల్ బస్సులు, ద్విచక్రవాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. ఈ రోడ్డు గురించి ఇప్పటికే కలెక్టర్‌కు రెండు సార్లు ఫిర్యాదు చేసిన సమస్య మాత్రం పరిష్కరం కావడం లేదన్నారు. కలెక్టర్, మున్సిపల్ అధికారులు స్పందించి ప్రాణ నష్టం జరగకముందు రోడ్డుకు మరమ్మత్తులు లేదా నూతన రోడ్డు వేయాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు ఉన్నారు.

# బాలింతలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



నవతెలంగాణ-నిర్మల్

ప్రసూతి ఆస్పత్రిలో గర్భిణీలకు, బాలింతలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రసూతి, పిల్లల ఆస్పత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి, గర్భిణీలు, బాలింతలకు, చిన్నారులకు అందిస్తున్న వైద్య సేవలను వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాతా, శిశు సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. శస్త్ర చికిత్సలను తగ్గించి, సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలని సూచించారు. ఆస్పత్రికి వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా బోధన ఆస్పత్రి పర్యవేక్షకులు డా.సునీల్ కుమార్, ప్రసూతి ఆస్పత్రి హెచ్ఓడీ డా.సరోజ, వైద్యులు ప్రదీప్, వాసు, విన్ని, నర్సింగ్ పర్యవేక్షకురాలు ధనలక్ష్మి, కార్యాలయ పర్యవేక్షకుడు నవీన్, నర్సింగ్, తహసీల్దార్ రాజు, అధికారులు రాంబాయమ్మ, జన, సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షాకాలం రాగానే హడావిడి పనులు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

వేసవి కాలములో మందస్తూ, నాణ్యతగా చేయాల్సిన పనులు మైనర్ ఇరిగేషన్ శాఖ అధికారులు చేపట్టకుండా, వర్షాకాలం రాగానే హడావిడిగా పనులు చేస్తున్నారు. మండలంలోని ముత్నూర్, శంకర్‌గూడ గ్రామాల వద్దనున్న చెరువుకు గత సంవత్సరం కురిసిన భారీ వర్షాల వల్ల సిమెంట్‌తో నిర్మించిన గోడ సైతం తెగి పోయింది. దీంతో చెరువు అలుగు నుంచి భారీగా వరదనీరు ప్రధాన రోడ్డుపై రావడంతో రోడ్డు కోతకు గురైంది. దీంతో జిల్లా కేంద్రం నుంచి కుమురంభీం, మంచిర్యాల, కరీంనగర్ వైపు వెళ్లే వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో చెరువు సైడ్‌వాల్‌కు మరమత్తులు చేపట్టాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించడంతో ఆ శాఖా అధికారులు ఇటీవల హడావిడిగా మొరం వేస్తూ, చదును చేస్తున్నారు. గతంలో కురిసిన భారీ వర్షానికి సిమెంట్ గోడనే కొట్టుకు పొగా ఇప్పుడు వేస్తున్న మొరంతో ఎలా మన్నికగా ఉంటుందని మండల వాసులు పేర్కొంటున్నారు.



## రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి



నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం రైతునేస్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు పత్తి పంటలో యాజమాన్య పద్ధతులు పంటలో వచ్చే చీడపీడల నివారణ గురించి, హైదరాబాద్ వ్యవసాయ శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి గణేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు కుంట మౌనిక, ఉమేష్, భూమేష్, మౌనిక, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ బాధితుడికి ఎమ్మెల్యే బాసట



నవతెలంగాణ-ఉట్నూర్

క్యాన్సర్ బాధితుడికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ బాసటగా నిలిచారు. చికిత్స కోసం ఆర్థిక సాయం అందించి, మానవత్వాన్ని చాటుకున్నారు. ఉట్నూర్ మండలం జైత్రామ్ తండాకు చెందిన ఉప్పారే రమేష్ గత కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. ఇటీవలే ఆయనకు ఆపరేషన్ జరిగింది. అయితే కిమో చేయానిదే, రోగం నయం కాదని డాక్టర్లు చెప్పడంతో కిమో కోసం హైదరాబాద్ వెళ్లడానికి వారి వద్ద డబ్బులు లేకపోవడంతో మంగళవారం రమేష్ కుటుంబ సభ్యులు ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను కలిసి తమ దీన పరిస్థితిని చెప్పుకొని కన్నీటి పర్యంత మయ్యారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తక్షణ సాయంగా వారికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించి, ఆస్పత్రికి పంపించారు.

## పెండింగ్ పోడు భూములకు విరాసత్ పట్టాలివ్వాలి

నవతెలంగాణ-నేరడిగొండ

పెండింగ్‌లోని పోడు భూములకు విరాసత్ పట్టాలివ్వాలని ఆదిలాబాద్ జిల్లా లంబాడ ఐక్యవేదిక అధ్యక్షులు మహేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న ఐటీడీఏలోని ఆర్వోఎఫ్ఆర్ వీరసత్ పట్టాల కోసం ఆరు సంవత్సరాల నుంచి ఆదివాసీ గిరిజన బిడ్డలు ఐటీడీఏ చుట్టూ తిరిగిన పట్టాలు అందడం లేదని అన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో రైతుబంధు నష్టపోతున్నారని అన్నారు. వారికి వెంటనే పట్టాలు అందజేయాలని అన్నారు. లేని యెడల ఆదివాసీ గిరిజన బిడ్డలతో ఐటీడీఏని ముట్టడి చేస్తామని హెచ్చరించారు. అంతేకాకుండా ఐటీడీఏలో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో లంబాడీల ఐక్యవేదిక మండలాధ్యక్షులు పాండు, లైవ్ నాయకులు వసంత్, రామ్, సురేందర్ ఉన్నారు.

## గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

నవతెలంగాణ-జైనథ్

మండలంలోని డోల్లారా గ్రామ శివారులో తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు వద్ద గల పెన్‌గంగా నదిలో ఆదివారం రాత్రి గల్లంతైన యువకుడు కొత్తం శివ(23) చాందా(టి)కి చెందిన యువకుడి మృతదేహం మంగళవారం డోల్లారా పెనుగంగా నది తీరాన లభ్యమయింది. ఈ సందర్భంగా సీఐ సాయినాథ్ మాట్లాడుతూ గల్లంతైన వ్యక్తి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు తమ సిబ్బంది ఎస్సై పురుషోత్తంతో కలిసి డీడీఆర్ఎఫ్ బృందంతో సోమవారం నుంచి గాలింపు చర్యలు చేపట్టగా మంగళవారం మృతదేహం లభ్యమైందని తెలిపారు. మృతదేహానికి పంచనామా చేసి రిమ్స్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

## బస్టాండ్‌లో ప్రయాణికులకు అవగాహన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం గుడిహత్నూర్ బస్టాండ్‌లో ప్రయాణికులకు రోడ్డు భద్రతపై ఆర్టీసీ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సదస్సులో రోడ్డుపై పాటించాల్సిన సూచనలు తెలియజేశారు. రోడ్డు సంకేతాలను తప్పకుండా పాటించాలని అన్నారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడుపవద్దని అన్నారు. వర్షాకాలంలో వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. హెవీ మోటర్ డ్రైవింగ్ శిక్షణ తరగతుల గురించి, యువకులకు వివరించారు. ప్రయివేటు వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని సూచించారు. ఆర్టీసీ గమ్యం యాప్ గురించి వివరిస్తూ ప్రయాణికులకు ఇన్‌స్టాల్ చేయించారు. కార్యక్రమంలో ఎస్డీఐ ఎస్కె యూసుఫ్, ఏడీసీ భాగ్యవతి, విలేజ్ బస్ ఆఫీసర్ సి.సతీష్ పాల్గొన్నారు.

## రెండు లక్షల రుణం మాఫీ చేయాలి

- ప్రభుత్వ తీరుపై ఎమ్మెల్యే నిరసన

నవతెలంగాణ-భైంసా

రైతులందరికీ భేషరతుగా రెండు లక్షల రుణం మాఫీ చేయాలని, ప్రభుత్వ తీరుపై ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పంచకట్టుతో అసెంబ్లీకి వెళ్లి నిరసన తెలిపారు. మంగళవారం బీజేపీ ఎమ్మెల్యేలంతా హైదరాబాద్‌లో అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం బేషరతుగా ప్రతి ఒక రైతుకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రేషన్ కార్డు నిబంధన పేరుతో కేవలం కుటుంబానికి రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తున్నారని, ప్రతి రైతు రుణమాఫీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. పాసు బుక్కుతో రుణాలు ఇచ్చి రేషన్ కార్డు పేరిట కోత విధించడం ఏంటని మండిపడ్డారు. రైతులకు పెట్టుబడి సాయం తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. రైతు కూలీలను ఆదుకుంటామన్న ప్రభుత్వ మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రైతు కూలీలకు ఒక్కో కుటుంబానికి రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చే హామీలు నెరవేర్చే వరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాడుతామని అన్నారు.

## జాతీయ నాయకులు సదా చిరస్మరణీయులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



దేశం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన జాతీయ నాయకులు ఎప్పటికీ చిరస్మరణీయులని మాజీ ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీపీ మల్లికార్జున్ మాట్లాడుతూ భారత జాతీయ ఉద్యమంలో బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ సేవలు ఎంతో విలువైనవని గుర్తు చేశారు. స్వతంత్ర భారతవనిలో స్వేచ్ఛ వాయువులు పీల్చుకోవడానికి అనేకమంది నాయకులు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు సుంకరి పెంటయ్య, కాంద్ర విశాల్, గాజుల సత్యనారాయణ, ప్రసాద్ గౌడ్, గొల్ల, వెంకన్న, సత్యనారాయణ, శంకర్ పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన

నవతెలంగాణ-సిర్పూర్(టీ)



మండలంలోని వేంపల్లి జడ్పీఎస్ పాఠశాలలో విద్యార్థులకు కాగాజ్‌నగర్ డివిజన్ షీ టీం ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం సభ్యురాలు రమాదేవి మాట్లాడుతూ మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైమ్‌లకు గురైతే వెంటనే షీటీంను సంప్రదించాలని సూచించారు. ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వాటి వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని ఫోటోలు, వీడియోలు పోస్ట్ చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళలకు రక్షణ కల్పించడం కోసమే షీ టీంలు పనిచేస్తున్నాయని, అత్యవసర సమయంలో డయల్ 100, షీ టీం కాగజ్‌నగర్ నంబర్ 8712670565కు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, షీ టీం సభ్యులు రమాదేవి, సునీత పాల్గొన్నారు.

## రుణమాఫీ అమలులో ఇబ్బంది లేకుండా చూడాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ పథకంలో అర్హత గల రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రుణమాఫీ అమలు చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకును సందర్శించి రుణమాఫీ పథకం నిర్వహణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రుణమాఫీ నిధుల విడుదల కార్యక్రమంలో భాగంగా రూ.లక్షలోపు రుణం రైతుల ఖాతాలలో నిధుల జమపై దృష్టి సారించాలని, రైతులకు ఎలాంటి షరతులు విధించకుండా నిబంధనల మేరకు జమ అయిన రుణ మొత్తాన్ని రైతులకు చెల్లించాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు రుణమాఫీ పథకం జిల్లాలో అర్హత గల ప్రతి రైతుకు వర్తించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు డిస్ట్రిక్ట్ అధికారి వి.జోషి, ఆసిఫాబాద్ తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్పాండే, బ్యాంకు మేనేజర్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీ నెరవేర్చాలి

నవతెలంగాణ-రెబ్బెన

కాంగ్రెస్ అధికారంలోకి రాగనే వృద్ధాప్య, వితంతు, పెన్షన్ రూ.4 వేలు ఇస్తామని, దివ్యాంగులకు రూ.ఆరు వేలు ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులు గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని గోలేటి గ్రామపంచాయతీ పోస్ట్ ఆఫీస్ కార్యాలయం వద్ద పెన్షన్ డబ్బుల గురించి వృద్ధులు, దివ్యాంగులు ఉదయం నుంచి పడిగాపులు కాస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 100 రోజుల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చి ఏడు నెలలు గడుస్తున్నా అమలు చేయడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందన్నారు. హామీలను అమలు చేయని పక్షంలో రానున్న ఎన్నికలలో ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మంతెన రాజయ్య, కేసరి సాయ గౌడ్, నారా పుల్లయ్య, గూగులోతు కిషన్ నాయక్, కోరల రాజయ్య, దుర్గం శంకర్, రుక్మిణి, మేంగు, పాండు పాల్గొన్నారు.

## హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు అందజేత



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ 2023 సెప్టెంబర్‌లో చనిపోయిన జలపతిరావు కుటుంబానికి రూ.8లక్షల చెక్కును ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో నిరంతరం విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది తమ ఆరోగ్యాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మరణించిన పోలీసుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం తరఫున మరణించిన పోలీసుల కుటుంబాలకు అందాల్సిన అన్ని రకాల ప్రతిఫలాలను త్వరితగతిన అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ అడ్మిన్ పెద్దయ్య, జిల్లా పోలీస్ కార్యాలయం ఏఓ శ్రీనివాస్, జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షులు ఎం.విజయ శంకర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ అజయ్ వర్మ పాల్గొన్నారు.

## నూతన ప్రెస్‌క్లబ్ ఎన్నిక



నవతెలంగాణ-సిర్పూర్(టి)

సమాజంలో బాధ్యత గల వృత్తి కేవలం జర్నలిస్టులేనని, కార్యనిర్వాక, శాసన న్యాయశాఖ తర్వాత కీలక ఫోర్త్ ఎస్టేట్, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేసేది జర్నలిస్టులేనని అలాంటి వృత్తిలో మనం కొనసాగడం గర్వించదగ్గ విషయమని జర్నలిస్టులు అన్నారు. మంగళవారం మండల ప్రెస్ క్లబ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పైడి సంతోష్, గౌరవ అధ్యక్షుడిగా జమీల్, ప్రధాన కార్యదర్శిగా దుస్స ధనుంజయ్, ఉపాధ్యక్షులుగా సయ్యద్ నజీర్ అలీ, ఆఫిత్, ఎంఏ సఫిల్, సహకార్యదర్శిగా రాపల్లి కృష్ణ, కమిటీ సభ్యులుగా తులసీదాస్, ఛాన్కపురే శంకర్, బాస సంతోష్, శ్రీధర్, రాజశేఖర్, కబీర్ హైమద్, డోంగ్రి రవీందర్, ప్రసాద్‌లున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీని స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

## 26న పోలీసు పాత వాహనాల విడి భాగాలు వేలం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వివిధ స్థాయిలో పోలీసులు వాడిన పాత వాహనాల విడిభాగాలను(తుక్కు) ఈనెల 26న పోలీస్ హెడ్ క్వార్టర్‌లో వేలం వేయనున్నట్లు ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు వేలంపాట నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సందేహాల నివృత్తి కోసం ఆసిఫాబాద్ ఎంటీఓ ఆర్ఐ కే.అంజన్న, మొబైల్ నెంబర్ 8712670517ని సంప్రదించాలన్నారు.

# నాణ్యమైన వైద్య సేవలందించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



పీహెచ్‌సీలో వైద్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-రెబ్బెన

ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే వైద్య సిబ్బందికి ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి తుకారం భట్‌తో కలిసి తనిఖీ చేశారు. ఆస్పత్రికి వచ్చిన గర్భిణులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి స్టోర్ రూమ్ పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. గర్భిణులకు ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు, సలహాలు చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో క్రిటికల్‌గా ఉన్న కేసులను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి పంపించాలే తప్ప ప్రయివేట్ ఆస్పత్రికి పంపించకూడదని సూచించారు. ఆస్పత్రి వైద్యుడు మంచిర్యాల ప్రయివేట్ ఆస్పత్రికి వెళ్ళమని రోగులకు సూచించగా ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇస్తున్న సేవలు ప్రజలకు అందినప్పుడే నిజమైన సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, ఆశ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రభుత్వ పాఠశాలలలో సకల సౌకర్యాలతో విద్యా బోధన**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలలో సకల సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం మండలంలో ఖైర్‌గాంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో తాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, వంటశాల ఇతర మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని, వార్షిక ఫలితాలను ఉన్నత మార్కులు సాధించేలా కృషి చేయాలన్నారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. భావితరాలకు స్వచ్ఛమైన సహజవాయువును అందించేందుకు మొక్కలు నాటి సంరక్షించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



పాఠశాలలో మొక్కలు నాటి నీరు పోస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

# ఉద్యోగోన్నతి బాధ్యత పెంచుతుంది

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



ఉద్యోగోన్నతి పొందిన ఏఎస్సైలతో ఎస్పీ డీవీ శ్రీనివాస్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉద్యోగుల్లో ఉద్యోగోన్నతి మరింత బాధ్యతను పెంచుతుందని ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు అన్నారు. జిల్లాలో పనిచేస్తున్న బషీరుద్దీన్, గులం మక్సుద్ అహ్మద్ ఏఎస్సైలుగా ఉద్యోగోన్నతి పొందగా, నాగరాజు, తిరుపతిలో హెడ్ కానిస్టేబుల్‌లుగా ఉద్యోగోన్నతి పొందగా వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగోన్నతితో ఉద్యోగం పట్ల మరింత బాధ్యత పెరుగుతుందన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ సర్వీస్‌లో మరిన్ని ఉద్యోగోన్నతులు పొందుతూ జిల్లాకు మంచి పేరు తీసుకురావడంతో పాటు వ్యక్తిగతంగా మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ టౌన్ సీఐ సతీష్, కాగజ్‌నగర్ రూరల్ సీఐ రాంబాబు, ఆర్ఐ అడ్మిన్ పెద్దయ్య, జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షులు ఎంవీఎస్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి

నవతెలంగాణ-రెబ్బెన

గోలేటి గ్రామంలో సింగరేణి సేకరిస్తున్న 58.09 ఎకరాల భూమి విషయంలో సింగరేణి, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సోషల్ ఆడిట్, సర్వే లో అనేక తప్పులు నమోదు చేశారని గోలేటి భూ నిర్వాసితులు ఆరోపించారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రేకు వినతిపత్రం అందించారు. రీ సర్వే చేయమని ఆర్డీఓకు విన్నవించగా రీ సర్వే చేయమని ఆదేశాలు ఇచ్చిన ఇప్పటివరకు కూడా రీ సర్వే నిర్వహించలేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆర్డీఓ పలుమార్లు వెళ్లి రీసర్వే గురించి అడగగా రీ సర్వే చేయలేమని చెబుతున్నారని తెలిపారు. దీంతో సుమారు 20 మంది రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. భూ నిర్వసితుల సంతకాల సేకరణ కొంతమంది దళారులు నేరుగా రైతుల వద్దకు వచ్చి చేస్తున్నారని, అవార్డు ఆమోదాన్ని రద్దు చేసి, రీ సోషల్ ఆడిట్, రీ సర్వే నిర్వహించే విధంగా సహకరించాలని కోరారు. ఇందులో భూనిర్వసితులు చల్లూరి అశోక్, సిడాం నాగేష్, సోగాల గౌతం, జాడి సంతోష్,పెరుగు దేవమ్మ, చునార్కర్ పోశం, పెరుగు తార, గువ్వల రామయ్య, దుర్గం సోమయ్య డి సోమయ్య పాల్గొన్నారు.



కలెక్టర్‌కు సమస్యను విన్నవిస్తున్న భూనిర్వాసితులు

# కాగజ్‌నగర్‌లో పర్యటించిన అడిషనల్ కలెక్టర్



22వ వార్డులో సమస్యలు తెలుసుకుంటున్న అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన ప్రాంతాలను మంగళవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి పరిశీలించారు. పట్టణంలోని వార్డు నెం. 22తో పాటు పలు వార్డులలో ఆయన పర్యటించి కూలిన ఇళ్ల గోడలు, పెట్రోల్‌పంపు నుండి రైల్వే ట్రాక్ వరకు ఉన్న ప్రధాన నాళాను పరిశీలించారు. నాళాను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో తమ ఇళ్లల్లోకి నీళ్లు వస్తున్నాయని పలువరు అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై పరిశీలన జరిపి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ అంజయ్యను అదనపు కలెక్టర్ ఆదేశించారు. తమ వార్డులో ఇళ్లపై నుండి విద్యుత్ తీగలు వెళ్తున్నాయని, ఎన్ని సార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని 22వ వార్డు కౌన్సిలర్ లావణ్య శరత్ ముదిరాజ్ ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం స్థానిక ఆర్ఆర్ఓ కాలనీలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని సందర్శించారు. విద్యాలయం చుట్టూ అపరిశుభ్రంగా ఉండకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ రమాదేవితో పాటు పలువురు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి నిధులు విడుదల చేయలేదు

- ఎమ్మెల్యే కోవ లక్ష్మీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



గడిచిన ఏడు నెలల్లో నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ నిధులు విడుదల చేయలేదని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా హైదరాబాద్‌లోని గన్ పార్క్ వద్ద అమరులకు నివాళులర్పించినంతరం ఆమె మాట్లాడుతూ ఆసిఫాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రస్తుత ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదన్నారు. ప్రజా ప్రభుత్వంలో వివక్ష తగదన్నారు. ఇప్పటికైనా వివక్ష వీడి అన్ని ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు

## ఫీల్డ్ కిట్లు పంపిణీ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ అటవీ డివిజన్ పరిధిలోని సిబ్బందికి మంగళవారం ఫీల్డ్ కిట్లు పంపిణీ చేశారు. అటవీ శాఖ డివిజన్ కార్యాలయంలో బేస్ క్యాంపు వాచర్లు, ట్రాకర్లకు ఎస్పీఎం యాజమాన్యం సామాజిక బాధ్యత కింద ఈ కిట్లు పంపిణీ చేసింది. కార్యక్రమంలో పేపర్ మిల్లు ప్రతినిధులు సంతోష్ దీపాలే, రీనా బిల్వాల్, డీఎఫ్ఓ శాంతారాం, ఎఫ్‌డీఓ అప్పలకొండ, ఎఫ్ఆర్ఓ రమాదేవి పాల్గొన్నారు.



## శిక్షణ పొందిన మహిళలకు పరీక్షలు



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గోలేటి సీఈఆర్ క్లబ్ మాదారంలోని కమ్యూనిటీ హాల్‌లో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో వృత్తి విద్య శిక్షణ కోర్సులలో శిక్షణ పొందిన మహిళలకు పరీక్షలు నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ పరీక్షలను కేవీఐబీ(ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు) రీజినల్ ఆఫీసర్ జే.అనసూయ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకొని కుటుంబానికి ఆర్థికంగా చేయూతగా ఉండాలని మహిళలకు సూచించారు. యూనిట్‌గా ఏర్పడి వ్యాపారం ప్రారంభించాలన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సేవా సమితి ద్వారా నాలుగు వృత్తి శిక్షణ కోర్సుల్లో( బ్యూటీసియాన్ -2, మగ్గం-2) మాదారంలో 37, గోలేటిలో 44 మంది శిక్షణ పొందిన మహిళలు పరీక్షలకు హాజరు అయ్యారు. కార్యక్రమంలో ఎస్ఎస్-ఎస్ చీఫ్ కోఆర్డినేటర్ డీఎస్ శివకుమార్, కేజీఎంవీ అధికారి బానోత్ నరేష్, సీనియర్ పీఓ ప్రశాంత్ పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకులు అందజేత



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని బొంబాయిగూడ గ్రామానికి చెందిన బోగ అంకుబాయి ఇల్లు భారీ వర్షాలకు కూలిపోయింది. మంగళవారం బీజేపీ నాయకుడు పాల్వాయి సుధాకర్‌రావు బొంబాయిగూడ గ్రామంలో బాధితురాలు ఇంటి వద్దకు వచ్చి రూ.రెండు వేల నగదుతో పాటు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త ప్రకాష్, నాయకులు చౌదరి గుండయ్య, నాగేష్, మధూకర్, సత్యనారాయణ, ప్రభాకర్, కమలాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి



నవతెలంగాణ-బెజ్జూర్

కాంగ్రెస్ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు తిరుపతిగౌడ్ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో నాయబ్ తహసిల్దార్ భీమ్లా నాయక్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కామారెడ్డి ఎన్నికల సభలో ప్రభుత్వంలోకి వచ్చిన ఆరు నెలలలోపే కులగణన చేసి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామన్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్న ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేవన్నారు. వెంటనే హామీలను అమలు చేయాలని లేని పక్షంలో ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ,ఉపాధ్యక్షులు కనికుట్ల వెంకటేష్ ,బిజెపి నాయకులు జాడి దిగంబర్, ఉమ్మెర బాలకష్ణ, సపవట్ బిక్షపతి గూడ్ ,రాకేష్ ,మెష్రం రాజారాం ,తలండి మోహన్, సిడం సంతోష్ ,బెణికి శ్యాంసుందర్ , రమేష్, బషీర్ ఖాన్ ,సామల తిరుపతి తదితరులున్నారు.

## సెల్ ఫోన్ దొంగిలించిన వ్యక్తిని పట్టుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ కుటుంబ సభ్యుల సెల్‌ఫోన్ దొంగిలించి మహిళలను ఇబ్బందులు పెడుతున్న సెల్ ఫోన్ దొంగను అరెస్ట్ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు రేగుంట కేశవ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్పీ డీవీ శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్ ఫోన్ దొంగిలించి దానిలో ఉన్న నెంబర్లతో మహిళలకు అసభ్యకరమైన పోస్టులు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని తెలిపారు. దీనిపై ఇప్పటికే కాగజ్‌నగర్ మండలం ఇస్గాం కు చెందిన వాడిగా గుర్తించి అక్కడి పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టామన్నారు. ఆయన పట్టించుకోకపోవడంతో వెంటనే దొంగను పట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరికెల సుశీల, రేగుంట యశోద, శ్రావణ్, మాతంగి ప్రసాద్ పాల్గొన్నారు.

## చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలి

నవతెలంగాణ-జన్నారం



చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిచాలని, గర్భిణులు, బాలింతలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలని లక్సెట్టిపేట్ సీడీపీఓ రేష్మ అన్నారు. మంగళవారం మండలంలోని కలమడుగు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారులకు మెనూ ప్రకారం వంట, ప్రీ స్కూల్ టైం టేబుల్ ఫాలో అవ్వాలని టీచర్లకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే ఆహారం ఎంతో పౌష్టికమైనదని గర్భిణులు, బాలింతలు తప్పకుండా ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇదన్‌పల్లి సెక్టార్ సూపర్‌వైజర్ కవిత పాల్గొన్నారు.

## సైబర్ మోసాలపై అవగాహన

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దుబ్బగూడెంలో గ్రామస్తులతో పాటు ఓపెన్ కాస్ట్ వద్ద కార్మికులకు వేర్వేరుగా సైబర్ మోసాలపై చైతన్య పరిచేందుకు ఏఎస్ఐ బూర రవీందర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ బూర రవీందర్ మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న సైబర్, ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలు, క్రెడిట్ కార్డ్స్ సంబంధిత మోసాలు, ఇన్వెస్ట్మెంట్ మోసాలు, అడ్వర్టైజ్మెంట్ ఫ్రాడ్స్, లోన్ యాప్‌లు, ఓటీపీ, సైబర్ క్రైమ్ పోర్టల్, సైబర్ ట్రోల్ ఫ్రీ నెంబర్ 1930పై వివరించారు. సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే సైబర్‌క్రైమ్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో రిపోర్ట్ చేయాలని, 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కి ఫోన్ చేయాలన్నారు. ప్రస్తుత సమాజంలో సెల్ ఫోన్ వలన ఎన్ని ఉపయోగాలు ఉన్నాయో, అన్ని అనర్థాలు కూడా జరుగుతున్నాయని, సెల్ ఫోన్ వినియోగం పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రుణ మాఫీ అనుమానాలు నివృత్తి చేసుకోండి

- వ్యవసాయ అధికారి మార్క్‌గ్లాడ్సన్



నవతెలంగాణ-జైపూర్

ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల రుణమాఫీ పట్ల ఎలాంటి అనుమానాలున్నా వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మార్క్‌గ్లాడ్సన్ తెలిపారు. కాగా ప్రభుత్వం ప్రకటించిన రూ. 2 లక్షల రుణమాఫీకి సంబంధించి మొదటి దఫాలో రూ.1 లక్ష మాఫీ చేసిన ప్రభుత్వం మిగితా వారి రుణమాఫీ విషయంలో ప్రభుత్వం పొందుపర్చిన వివరాలు వెల్లడించడం జరుగుతుందని తెలిపారు. రూ.1 లక్ష నుండి రూ. 2 లక్షల మధ్య రుణ మాఫీ ఏప సంధర్భాల్లో మాఫీ అవుతుందనే విషయాన్ని ఏఈఓ ద్వార పూర్తి స్థాయి సమాచారం పొందవచ్చునని తెలిపారు. రైతులు తమకు సంబంధించిన ఆధార్‌కార్డుతో ఏఈఓలను కలిసి సమాచారం తెల్సుకోవడం కోసం ఏఈఓలు రైతు వేదికల్లో అందుబాటులో ఉంటారని తెలిపారు. భీమారం మండలానికి సంబంధించి భీమారం రైతు వేదికలతో స్థానిక ఏఈఓ అందుబాటులో ఉండగా జైపూర్ మండల పరిధి రైతుల సౌకర్యార్థం వేలాల, టేకుమట్ల, జైపూర్, కుందారంలలో గల రైతు వేదికల్లో సంబంధిత ఏఈఓలు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

**ఆగస్టు 5 వరకు రైతు బీమా చేయించుకోవాలి**

కొత్తగా భూమి కొనుగోలు చేసిన రైతులు విధిగా రైతు బీమా చేయించుకోవాలని వ్యవసాయ అధికారి మార్క్‌గ్లాడ్సన్ తెలిపారు. ఆగస్టు 5 లోపు తమకు చెందిన పట్టాదార్ పాసుపుస్తకం, ఆధారుకార్డుతో స్థానిక ఏఈఓలను కలిసి రైతు భీమా చేయించుకోవాలని తెలిపారు. రైతు భీమా పథకాన్ని ఉమ్మడి జైపూర్, భీమారం మండలాల పరిధి రైతులు విధిగా చేయించుకోవాలని ఈ సంధర్భంగా కోరారు.

## భారీ వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-వేమనపల్లి

భారీ వర్షాల దష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల అభివృద్ధి అధికారి దేవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కల్లంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా జరిగినటువంటి పనులను, గ్రామంలో జరుగుతున్నటువంటి పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రతిరోజు పారిశుధ్య పనులను నిరంతరం కొనసాగించాలనీ పంచాయితీ కార్యదర్శికి సూచించారు. అనంతరం నీల్వాయి గ్రామపంచాయితీ పరిధిలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కోతకు గురైన మామడ వాగు వంతెనను ఎంపీడీఓ పరిశీలించారు. గ్రామ కార్యదర్శి అశోక్ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారాన్నీ పై అధికారులకు తెలపాలని సూచించారు. అనంతరం వర్షం కారణంగా కూలిపోయిన ఇండ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి సుదర్శన్, ఫీల్డ్ అసిస్టెంట్ సంజీవ్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని

నవతెలంగాణ-జన్నారం

వరి, పత్తి పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులను పాటించాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు సూచించారు. వరి, పత్తి పంటలకు సాగుపై మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మండల వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు. అనంతరం శాస్త్రవేత్తలు మాట్లాడారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో పంటల ఎదుగుదలకు కావలసిన ఎరువులు, యూరియా, మందులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు త్రిసంధ్య , మధుకర్, దివ్య పాల్గొన్నారు.

## మందులను క్రమం తప్పకుండా వాడాలి

నవతెలంగాణ-జన్నారం



వ్యాధులతో బాధపడేవారు మందులను క్రమం తప్పకుండా వాడాలని జన్నారం ప్రభుత్వ ఆస్పత్రి హెల్త్ అసిస్టెంట్ కమలాకర్, తిమ్మాపూర్ ఆశావర్కర్ రజిత కోరారు. మంగళవారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ప్రజలకు ప్రభుత్వ వైద్య సిబ్బంది వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వ్యాధులతో బాధపడుతున్న వారికి మందులను అందజేశారు. వర్షాలు బాగా పడుతున్నాయని, ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి చుట్టూ మరుగు నీరు నిల్వఉకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



## రాంపూర్‌లో పోలీస్ పల్లె నిద్ర

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంపూర్‌లో పోలీసు పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు పల్లె నిద్రలో భాగంగా గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను తెలుసుకోవడంతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించారు. గంజాయి, సైబర్ క్రైం, సీసీ టీవీల ఆవిష్యకత, 100 డయల్ తదితర అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పోలీసులు ప్రజా రక్షణకే పాటు పడుతారని, ఎటువంటి సమస్య ఉన్నా వెంటనే సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఎండీఎం పథకాన్ని

## ప్రయివేటు సంస్థలకు అప్పగించడం సరికాదు

నవతెలంగాణ-నస్పూర్



మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేటు సంస్థలకు అప్పగించడం సరికాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అన్నారు. మంగళవారం మధ్యాహ్న భోజన కార్మిక సంఘం(సీఐటీయూ) అధ్యక్ష, కార్యదర్శులు దాసరి రాజేశ్వరీ, ఎండీ రఫీయా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలోని 7మండలల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం పథకాన్ని ప్రయివేట్ సంస్థలకు అప్పగించిందని, దీన్ని సీఐటీయూ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ప్రయివేటు సంస్థకు ఇచ్చే నిర్ణయాన్ని వెనక్కి తిసుకోవాలని, మధ్యాహ్న భోజన కార్మికులకిచ్చే గౌరవ వేతనం, విద్యార్థులకిచ్చే మెనూ చార్జీలు పెండింగ్లో ఉన్నాయన్నారు. నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి, ప్రభుత్వానికి ఎదురు పెట్టుబడి పెట్టి, వంట చేసి పెడుతున్నారని, రాగి జావ పోయాలని చెప్పడంతో కార్మికులు అప్పులపాలౌతున్నారని అన్నారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పెరిగిన ధరలకనుగుణంగా పిల్లలకిచ్చే మెనూ చార్జీలు పెంచడం లేదన్నారు. కార్మికుల జీతాలు పెరగకపోగా, ఉన్న జీతాలు కూడా నెలల తరబడి పెండింగ్లో ఉన్నాయని వాపోయారు. ప్రస్తుతం కేటాయించిన బడ్జెట్ పాత మెనూకే సరిపోవడం లేదని, మెనూ చార్జీలు పెంచాలని, కార్మికుల పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేసి కార్మికుల వ్యక్తిగత ఖాతాల్లోనే వేయాలన్నారు. గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలి లేదా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసినట్లు మధ్యాహ్న భోజన పథకానికి కూడా సరఫరా చేయాలన్నారు. రాష్ట్రమంతటా గృహలక్ష్మి పథకం పేరుతో గ్యాస్ సిలిండర్ రూ.500లకే ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రకటించి అమలుకు శ్రీకారం చుట్టిందని, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు అవసరమైన గ్యాస్ సబ్సిడీ ఇవ్వాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10,000 ల వేతనం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దూలం శ్రీనివాస్, గట్టు మహేందర్, సమ్మయ్య సరిత జిల్లా ఉపాధ్యక్షురాలు, జిల్లా కమిటీ సభ్యులు మధునమ్మ, లక్ష్మి, కళావతి, జ్యోతి పాల్గొన్నారు.

## ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం

- ఎస్టీపీపీ ప్రధాన మార్గంలో జెండా ఆవిష్కరించిన కార్మికులు



నవతెలంగాణ-జైపూర్

భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) 70వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఎస్టీపీపీ కాంట్రాక్టు కార్మికులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం జైపూర్ ఎస్టీపీపీ ప్రధాన మార్గంలో జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. ఈ సంధర్భంగా బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి దుస్స భాస్కర్ మాట్లాడుతూ ఎస్టీపీపీ కార్మికుల హక్కుల సాధన కోసం బీఎంఎస్ పాటుపడుతోందని అన్నారు. 1955 జూలై 23న ఆవిర్భవించిన బీఎంఎస్ 69 సంవత్సరాలు పూర్తి చేసుకుని 70వ సంవత్సరంలో అడుగుపెట్టిందని తెలిపారు. దేశంలో అత్యధిక సభ్యత్వం కలిగినటువంటి యూనియన్‌గా బీఎంఎస్ గుర్తింపు పొందదని తెలిపారు. సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లో కార్మికుల హక్కులు, వారి సంక్షేమం కోసం బీఎంఎస్ కార్మికుల పక్షాన పోరాడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ బీఎంఎస్ యూనియన్ ఉపాధ్యక్షులు చిలకాని వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఈగ సురేందర్, కార్యదర్శి బోదకుంట శ్రీధర్, కళ్యాణపు సతీష్ పాల్గొన్నారు.

**నస్పూర్ :** బీఎంఎస్ ట్రేడ్ యూనియన్ 70వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన శ్రీరాంపూర్ ఏరియాలోని వివిధ గనులు, డిపార్ట్మెంట్లలో బీఎంఎస్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్మికులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నాయకులు చాట్ల అశోక్, నాతాడి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ రక్షణ, సంస్థ పరిరక్షణ, కార్మికుల సంక్షేమం ఎజెండాగా రాజకీయ పార్టీలకు అతీతంగా మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్ పట్టణములో 1955 జులై 23న బీఎంఎస్ ఆవిర్భవించిందాన్నారు. బీఎంఎస్ యూనియన్ అంచలంచలుగా ఎదుగుతూ భారతదేశంలోని సంఘటిత, అసంఘటిత కార్మిక రంగంలో 150కి పైగా వివిధ అనుబంధ సంఘాలతో ఉన్నత ప్రమాణాలతో దేశంలోనే అత్యధిక సభ్యత్వం కలిగిన ట్రేడ్ యూనియన్‌గా అవతరించిందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కార్యదర్శులు, రాగం రాజేందర్, జిడి ప్రభాకర్, బ్రాంచ్ కార్యదర్శి కట్ట ఈశ్వరచారి, ట్రెజరర్ గూడ శ్రీకాంత్, జాయింట్ సెక్రెటరీలు పురుషోత్తమ చారి, బూంపల్లి రమేష్, మేకల స్వామి పాల్గొన్నారు.

## భేషరతుగా రైతు రుణమాఫీ చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కలిందర్ ఖాన్

నవతెలంగాణ-జన్నారం



ప్రతి రైతుకు బేశరతుగా రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కళిందర్ ఖాన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో పత్రికా విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం తెలంగాణ రైతాంగం అయోమయానికి లోనవుతోందని అన్నారు. రైతు రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం పెడుతున్న కొర్రీలను వెంటనే విరమించుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీగా డిమాండ్ చేస్తున్నాం అన్నారు. రాష్ట్రంలో 70 లక్షల మంది రైతులు ఉండగా దాదాపు 50 నుంచి 60 లక్షల మంది రైతులు రుణం తీసుకొని ఉన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఏ షరతులు లేకుండా ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీని అమలు చేయాలి రైతు బంధును వెంటనే రైతులకు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాం అన్నారు. ఇటు రైతు బంధులో కానీ అటు రైతు రుణమాఫీలో కానీ పెట్టే ఆంక్షలు ద్వారా రైతులు చాలామంది అర్హతలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు దేవి పోచన్న, చాడ మహేందర్‌రెడ్డి, బియ్యాల రాజేశం, దాసరి తిరుపతి, మామిడి విజయ్ పాల్గొన్నారు. అనంతరం సీపీఐ జన్నారం మండల కార్యదర్శిగా దాసరి తిరుపతి, మండల కన్వీనర్‌గా మామిడి విజయ్‌లను నియమించారు.

## తహసీల్దార్ కార్యాలయం తనిఖీ



నవతెలంగాణ-జైపూర్

కోటపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం కలెక్టర్ కుమార్ దీపక్ అకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, ప్రజలకు జవాబుదారిగా వ్యవహరించాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగుల హాజరు రిజిస్టర్లు, రికార్డు గదులు, కార్యాలయ ప్రాంగణం పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహణ కల్పించాలని సూచించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలను సంధర్శించి పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులపై ఆరా తీశారు. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, సమయపాలన పాటించి విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని తెలిపారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ వార్షిక పరిక్షలలో మంచి మార్కులు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వార్డులు, ఫార్మసీ, రిజిస్టర్లు పరిశీలించి వైద్యులు, సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేంద్రనాథ్, రోడ్లు భవనాల శాఖ ఈఈ అటవీ డివిజనల్ అధికారి, మండల పంచాయతీ అధికారి పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న బ్యాగ్ తిరిగి ఇచ్చిన పోలీసులు

నవతెలంగాణ-మంచిర్యాల

శ్రీరాంపూర్ నుంచి మంచిర్యాలకు ఆటోలో వెళ్తున్న క్రమంలో ఒక మహిళ తన హ్యాండ్ బ్యాగ్‌ను పోగుట్టుకుంది. మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన మహిళకు అక్కడే అందుబాటులో ఉన్న బ్లూ కోర్టు సిబ్బంది పోగొట్టుకున్న బ్యాగ్‌ను తెచ్చి అప్పజెప్పారు. విలువైన వస్తువులు, నగదుతో ఉన్న బ్యాగ్ పోయిందనుకున్న మహిళకు పోలీసులు తిరిగి తెచ్చివ్వడంతో అభినందనలు తెలిపింది. సదరు మహిళ పోయిన బ్యాగ్ ను తెచ్చి ఇచ్చే క్రమంలో చాకచక్యంగా వ్యవహరించిన హోంగార్డ్ రఫీక్, హెడ్ కానిస్టేబుల్ తిరుపతిని సిబ్బంది అభినందించారు.

## విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ

నవతెలంగాణ-మందమర్రి

శ్రీవచ సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. బాల గంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతి సందర్భంగా మంగళవారం శ్రీవచ సేవా సంస్థ ఆధ్వర్యంలో అంగడి బజార్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పెన్నులు, పెన్సిల్స్, నీళ్ల బాటిల్స్, నోట్ బుక్స్, కంపాక్స్ బాక్సులను సీఐ శశిధర్ రెడ్డి, ఎంపీడీఓ రాజేశ్వర్, ఎస్ఐ రాజశేఖర్ చేతులు మీదుగా పంపిణీ చేసారు. విద్యార్థులకు కనీస అవసరాలయిన వస్తువులను అందించి వారి కళ్లలో ఆనందాన్ని నింపిన శ్రీవచ సేవా సంస్థ సభ్యులను సీఐ అభినందించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ విద్యార్థులను చక్కగా చదువుకుని మంచి పేరు సంపాదించుకోవాలని సూచించారు. సామాజిక స్పృహతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని సంస్థ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఉప్పలంచి చంద్రకాంత్, దాసరి శ్రీకాంత్, మాచర్ల వెంకటస్వామి, సాగర్, రాచర్ల గణేష్, భీమనాదుని సదానందం, కిషోర్, వేణుగోపాల్, సంపత్ పాల్గొన్నారు.

## పర్యావరణ చట్టాలపై అవగాహన

నవతెలంగాణ-మందమర్రి



పర్యావరణ అనుమతులు, చట్టాలపై అధికారులకు అవగాహన నిర్వహించారు. మంగళవారం మందమర్రి జీఎం కార్యాలయంలో జీఎం మనోహర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎన్విరాన్మెంట్ జీఎం కార్పొరేట్ జెవిఎల్ గణపతి పర్యావరణ సంబంధిత చట్టాలు, గనులకు సంబంధించిన పర్యావరణ అనుమతుల గురించి మందమర్రి, బెల్లంపల్లి ఏరియా అధికారులకు అవగాహన కల్పించారు. అనంతరం ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ పొందుతున్న ఎన్విరాన్మెంట్ జీఎం కార్పొరేట్ గణపతికి మందమర్రి జీఎం మనోహర్, బెల్లంపల్లి జీఎం రవి ప్రసాద్‌తో పాటు అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం మనోహర్ మాట్లాడుతూ పదవీ విరమణ అనంతరం తమ జీవితం ఆయురారోగ్యాలతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. సింగరేణి సంస్థకు వారు చేసిన సేవలను గుర్తు చేస్తూ కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రాజేశ్వర్ రెడ్డి, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్ విడుదల

నవతెలంగాణ-మందమర్రి

ఫోటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్‌ను మంగళవారం ఎంపీడీఓ నూటెంకి రాజేశ్వర్ విడుదల చేశారు. ఈ నెల 26, 27, 28 తేదీలలో రాష్ట్ర ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం, ఫోటోటెక్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఫోటో గ్రాఫర్ల పండుగ ఫోటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్‌ను మందమర్రి ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మందమర్రి అధ్యక్షులు పసుల వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి ఆడెపు అశోక్, కోశాధికారి బద్రి సతీష్, వర్కింగ్ ప్రెసిడెంట్ వలస మణిరాజ్, ఉపాధ్యక్షుడు ఆర్ సుజిత్, కార్యదర్శి పసుల రవి, ప్రచార కార్యదర్శులు కందుకూరి శ్రీకాంత్, రామసాని సురేందర్, కేశవేణి హరికృష్ణ, కార్యనిర్వహణ కార్యదర్శి జూపాక సది, కుడిపూడి రాము పాల్గొన్నారు.

**జన్నారం :** మంచిర్యాల జిల్లా ఫోటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఫోటో వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం సంయుక్తంగా జూలై 26, 27, 28న నిర్వహిస్తున్న ఫోటో ట్రేడ్ ఎక్స్‌ఫో పోస్టర్‌ను మంగళవారం జన్నారం అసోసియేషన్ అధ్వర్యంలో బాలాజీ స్టూడియో వద్ద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గని రవీందర్, కోశాధికారి శ్రీపతి రవి, మంచిర్యాల టౌన్ అధ్యక్షుడు రాజబాబు, నూనె సురేష్, మండల అధ్యక్షుడు పోతు వేణు పాల్గొన్నారు

## మత విద్వేషాలను రెచ్చగొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-కాసిపేట

మత విద్వేశాలను రెచ్చగొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, క్రైస్తవుల మనోభావాలను కించపరుస్తున్న యూట్యూబ్ ఛానల్స్‌ను నిలిపివేయాలని కోరుతూ ఉత్తర తెలంగాణ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ దీపక్ జాన్‌కు వినతిపత్రం అందించారు. ఈ మధ్య కాలంలో సోషల్ మీడియా మాధ్యమాల్లో అనేకమైన మత వివాదాలు, మత విమర్శలను జరుగుతున్నాయని, ఒకరి మీద మరొకరు భయంకరంగా విమర్శస్తూ మత శక్తులు ఉన్మాదంగా క్రైస్తవ మతాన్ని క్రైస్తవులను విమర్శిస్తూ క్రైస్తవుల మనో భావాలను కించపరుస్తున్నారని వివరించారు. యూట్యూబ్ ఛానల్స్, ఫేస్ బుక్ అనేకమైన మీడియా మాధ్యమాల ద్వారా కించపరుస్తూ దూషిస్తూ క్రైస్తవులను భయాందోళనకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రైస్తవ మత విశ్వాసాలను శివ శక్తి ఛానల్, ధర్మరక్షణ ఇంకా కొన్ని మాధ్యమాల ద్వారా బైబిల్‌ను విమర్శిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్తర తెలంగాణ పాస్టర్స్ అసోసియేషన్ ఐపీఏఎంఆర్ ప్రెసిడెంట్ ఎస్ శ్యామ్యూల్, ఉపాధ్యక్షులు కే ప్రసాద్, జనరల్ సెక్రటరీ ఏసుదాస్, మండల ఇన్‌చార్జి రాజేష్, టీపీఎఫ్టీ ప్రెసిడెంట్ మ్యాతువ్ ఎం జార్జ్, జనరల్ సెక్రటరీ బి జోషి, కోఆప్షన్ నెంబర్ అనీల్ కుమార్, నాయకులు ముత్తినేని రవి కుమార్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

నవతెలంగాణ-జన్నారం

విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు మంచి విద్యను అందించాలని రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీ బాయి అన్నారు. మంగళవారం మండలంలోని కవ్వాల్ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలోని 9, పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి వారికి అందిస్తున్న వసతి సౌకర్యాలు, విద్య బోధనం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంట గది, వంట సరుకులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, అంటువ్యాధులు వ్యాపించకుండ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో నెలకొన్న కొన్ని సమస్యలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు శైలజ మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీ బాయి దృష్టికి తీసుకెళ్లగా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తామని ఆమె అన్నారు.

## జిల్లాలో పలువురు ఎంపీఓల బదిలీలు

నవాతెలంగాణ-హాజీపూర్

మంచిర్యాల జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన మండల పంచాయతీ అధికారులు(ఎంపీఓ) బదిలీ అయ్యారు. 16 మండలాలకు చెందిన ఎంపీఓల్లో 10 మంది బదిలీ కాగా వీరిలో 8 మంది మంచిర్యాల, ఇద్దరు రాజన్న సిరిసిల్లజిల్లాకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం జిల్లాలో భీమిని, కన్నెపల్లి, వేమనపల్లి మండలాలకు ఎంపీఓల నియామక ప్రక్రియ మిగిలి ఉండగా కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి ఉమర్షరీఫ్ ఎంపీఓ జిల్లాకు బదిలీపై రాగా జన్నారంకు కేటాయించారు. ఇప్పటికే జిల్లాలో ఎంపీఓలు భాధ్యతలు స్వీకరించగా మరో రెండు, మూడు రోజుల్లో ఖాళీ ఉన్న మండలాల్లోనూ ఎంపీఓల నియామక ప్రక్రియ పూర్తి చేస్తామని డీపీఓ వెంకటేశ్వర్రావు తెలిపారు.

## కార్యదర్శుల బదిలీలు పూర్తి

నవతెలంగాణ-హాజీపూర్

జిల్లాలోని పంచాయతీ కార్యదర్శుల బదిలీల ప్రక్రియ పూర్తయ్యింది. నాలుగేళ్ల పైబడి ఒకే చోట పని చేసిన వారు విధిగా బదిలీ అయ్యారు. మొత్తం 92 మంది పంచాయతీ కార్యదర్శులు బదిలీ కాగా వీరికి ఉత్తర్వులు కూడా అందించారు. జిల్లాలోని 311 గ్రామ పంచాయతీల్లో బదిలీ అయిన 92 మందిలో గ్రేడ్-1 కార్యదర్శులు ముగ్గురు, గ్రేడ్-2 కార్యదర్శులు అయిదుగురు, గ్రేడ్-3 కార్యదర్శులు 11, గ్రేడ్-4 కార్యదర్శులు 73 మంది బదిలీ అయ్యారు. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి 13 మంది కార్యదర్శులు మంచిర్యాల జిల్లాకు బదిలీపై వచ్చారు. వీరంతా కూడా రెండు రోజుల్లో వారికి కేటాయించిన ఆయా గ్రామాల్లో కార్యదర్శులుగా భాధ్యతలు స్వీకరించనున్నారు.

## వసతి గృహాల్లో దోమల మందు పిచికారి

నవతెలంగాణ-మంచిర్యాల

పట్టణంలోని ఎస్సీ, బీసీ, పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్‌లో మంచిర్యాల జిల్లా వైద్య అధికారిని అనిత ఆధ్వర్యంలో దోమల మందును పిచికారి చేశారు. వర్షా కాలం నేపథ్యంలో హాస్టల్‌లో ఉండే విద్యార్థులు రోగాల బారిన పడకుండా ఉండేందుకు ఆల్ఫా సైఫర్ మెత్రిన్ అనే దోమల మందును పిచికారి చేపించినట్లు అధికారిని తెలిపారు. కాలానుగుణంగా వచ్చే పలు వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండలని, వ్యాధులపై పిల్లలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖ సిబ్బంది అల్లాడి శ్రీనివాస్, నందేవ్ పాల్గొన్నారు.

## 26న ఆటో యూనియన్ ఎన్నికలు

నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల పట్టణ ఆటో యూనియన్ అధ్యక్ష ఎన్నికలు ఈ నెల 26న నిర్వహించనున్నట్లు ఆటో యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పొట్ట మధు తెలిపారు. పాత కమిటీ కాల పరిమితి ముగిసినందున సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి అదే రోజు నూతన కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. మంచిర్యాలలోని బీఎంఏ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే ఎన్నికలకు ఐడీ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్క ఆటో డ్రైవర్ తమ ఓటు హక్కుని వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో చల్ల విక్రమ్, ఆవుల సుధాకర్, వెంకటేష్, అంజయ్య, క్రాంతి, రాజేందర్ గౌడ్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | జులై 24, 2024 | www.navatelangana.com

## నీటి పొదుపుపై అవగాహన

నవతెలంగాణ-కాగజ్‌నగర్



నీటిని పొదుపుగా వినియోగించుకోవాలనే అంశంపై మంగళవారం కాగజ్‌నగర్ మండలం భట్టుపల్లి ఎంపీపీఎస్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. సిర్పూరు పేపర్ మిల్లు, స్పర్శ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు నీటి పొదుపు నల్లాలను పంపిణీ చేశారు. మంచినీటి పైపులకు నల్లాలు లేకపోవడంతో నీరు వృథాగా పోతోందని, ఈ నీటి వృథాను అరికట్టాలని నిర్వాహకులు సూచించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.లక్ష్మినారాయణ, జెడ్పీఎస్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, ఉపాధ్యాయులు టి.నాగేశ్వర్‌రావు, బి.శాంతికుమార్, స్పర్శ ఫౌండేషన్ సీతఈఈ సుశీల పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

నవతెలంగాణ-లోకేశ్వరం



ప్రజలు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని భైంసా డిపో సెఫ్టీ వార్డెన్ కేఎల్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ప్రయాణికులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రోడ్డుపై పాటించాల్సిన సూచనలు, సంకేతాలను తప్పకుండా పాటించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడుపవద్దని, వర్షాకాలంలో వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో భైంసా డిపో ఎడీసీజెఎస్ రావు ప్రయాణికులు ఉన్నారు.

## దేశీదారు బాటిళ్ల పట్టివేత



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో మంగళవారం ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించి దేశీదారు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కాగజ్‌నగర్‌కు వచ్చిన అహల్యానగరి ఎక్స్‌ప్రెస్ రైలులో అధికారులు తనిఖీలు నిర్వహించగా, మహారాష్ట్ర నుండి తరలిస్తున్న 175 (90ఎంఎల్) దేశీదారు బాటిళ్లు లభ్యమైనట్లు ఎక్సైజ్ సీఐ వి.రవి తెలిపారు. ఈ తనిఖీలలో ఎక్సైజ్‌తో పాటు జీఆర్‌పీ, ఆర్‌పిఎఫ్ సిబ్బంది కూడా పాల్గొన్నారు.

## మందుల దుకాణాలు తనిఖీ

నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రంలోని మందుల దుకాణాలను డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అశ్విని తనిఖీలు నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో ఆరు మందుల దుకాణాలుండగా కేవలం మహాత్మా మెడికల్ మందుల దుకాణం మాత్రమే తెరుచుకొని ఉంది. మిగతా 5 మందుల దుకాణాలు మూసి ఉన్నాయి. దీంతో మహాత్మా మెడికల్‌లోని మందులను పరిశీలించారు. స్టాక్ వివరాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. కాలం చెల్లిన మందులను విక్రయించవద్దని ఈ సందర్భంగా మెడికల్ నిర్వాహకులకు సూచనలు చేశారు.

## ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని ఎస్పీఎం క్రీడా మైదానంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని వాకర్స్ అసోషియేషన్ సభ్యులు కోరారు. మంగళవారం సిర్పూరు పేపర్ మిల్లు వైస్ ప్రెసిడెంట్‌కు వినతిపత్రం పంపించారు. పట్టణవాసులకు వాకింగ్‌కు ఎస్పీఎం క్రీడా మైదానం ఎంతగానో ఉపయోగపడుతుందని, ఈ సౌకర్యం కల్పిస్తున్నందుకు యాజమాన్యానికి ధన్యవాదాలు తెలుపుతున్నామని, అదే సమయంలో మైదానంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తే ఎంతో సౌకర్యంగా ఉంటుందని, తమ వినతిని పరిగణలోనికి తీసుకొని వీలైనంత త్వరగా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో వాకర్స్ అసోషియేషన్ సభ్యులు ఎం సుభాష్, గోపి రెడ్డి, ముంజం ఆనంద్‌కుమార్, జగన్మోహన్, రాంకుమార్ బోడేకర్, మధూకర్, రమేష్, జూపాక నారాయణ, నరసింహులు, నికురె నాగేందర్, మాణిక్యం పాల్గొన్నారు.

## ఆలయ ప్రాంగణంలో వన మహోత్సవం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ మొక్కలు పెంచడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు తోడ్పడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వివేక్, రమేష్, ఉదయ్, నారాయణమూర్తి, లక్ష్మణమూర్తి, రాధాకృష్ణ చారి, విజయ్ కుమార్ శర్మ భూషణం, జీవన్, సుధాకర్ పాల్గొన్నారు.

## ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం కాగజ్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. స్థానిక బీఎంఎస్ కార్యాలయంలో జెండాను జిల్లా సంఘటన కార్యదర్శి అన్నం రాజన్న, జిల్లా అధ్యక్షుడు మల్లేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'దేశం కోసం పని చేస్తాం-తగిన వేతనం సాధిస్తాం' అనే నినాదంతో బీఎంఎస్ ముందుకు సాగుతోందన్నారు. దేశం నిలిస్తే కార్మికులు నిలుస్తారని, కార్మికులలో దేశభక్తిని పెంపొందిస్తూ వారిని దేశానికి అంకితం చేసేది బీఎంఎస్ అని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎంకె ప్రసాద్, కార్యకర్తలు పెంటు, జాన్‌ప్రకాష్, సుదర్శన్, నానయ్య, రాం కుమార్, పోచయ్య పాల్గొన్నారు

## క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని దస్నాపూర్ కాలనీకి చెందిన ఉప్పరి రమేష్ అనే బాధితుడు క్యాన్సర్ వ్యాధితో గత కొన్ని రోజుల నుంచి బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పట్టణానికి చెందిన మౌనిష్‌రెడ్డి మంగళవారం రూ.6వేలు అందించి ఆర్థికంగా అండగా నిలిచారు. అలాగే రెండు నెలలకు సరిపడా సరుకులను అందజేసి ఆ కుటుంబానికి ఆసరాగా నిలిచారు. ఆయన వెంట యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్ గౌడ్ ఉన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వాలు మారిన భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదని, సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు గాజేంగుల రాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని నేతాజీ చౌక్‌లో కార్మికులతో కలిసి ఈనెల 26న హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నాను విజయవంతంపై అవగాహన కల్పించారు. ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు గాజెంగుల రాజు మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. వాటి పరిష్కారం కోసం అనేక మార్లు ప్రభుత్వాలకు విన్నవించిన పట్టించుకోవడం లేదన్నారు. సాధారణ మరణానికి రూ.5లక్షలు, యాక్సిడెంట్‌కు రూ.10లక్షలు, మెటర్నటికి బెన్ఫిట్స్ లక్ష, పెండ్లీ కానుక కింద రూ.లక్షతో పాటు 60 సంవత్సరాల దాటిన వారికి రూ.5వేల వేల పింఛన్ ఇవ్వాలనే డిమాండ్‌తో 26న నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

# సోషల్ ఆడిట్‌లో బయటపడిన అక్రమాలు

- ఆలస్యంగా ప్రారంభమై రాత్రి వరకు కొనసాగిన సామాజిక తనిఖీ



సామాజిక ప్రజావేదికలో వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ మండల పరిధిలోని 27 గ్రామపంచాయతీలో గత ఆర్థిక సంవత్సరంలో చేసిన మహాత్మా గాంధీ ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ జిల్లా కేంద్రంలోని మండల కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. డీఆర్డీఓ సురేందర్, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, కార్యాలయ అధికారి కృష్ణమూర్తి ఇతర అధికారులు తనిఖీలో అవకతవకలు బయటపడ్డాయి. సాయంత్రం 7 గంటల వరకు 9 గ్రామ పంచాయతీల తనిఖీ పూర్తికాగా అధికారులు తెలిపిన వివరాల ప్రకారం వివిధ పనులకు సంబంధించి రూ.32,600 పెనాల్టీ విధించడంతోపాటు, రూ.1,26200 రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు. 4 పనులను నాణ్యత ప్రమాణాల విభాగానికి బదిలీ చేసినట్లు, 16 మందికి వివిధ పనులకు సంబంధించి షోకాజు నోటీసులు జారీ చేయగా, 3 వర్క్ రికవరీ చేసినట్లు వివరించారు. ఇంకా 18 జీపీలు మిగిలి ఉండడంతో పెద్ద ఎత్తున అక్రమాలు బయటపడే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో ఏపీఎం చంద్రశేఖర్‌తో పాటు ఇతర అధికారులున్నారు.

**ఆలస్యంగా ప్రారంభమై.. రాత్రి వరకు కొనసాగి..**

అధికారులు సామాజిక తనిఖీని ఉదయం 10 గంటలకు ప్రారంభించడానికి నిర్ణయించినప్పటికీ అనుకున్న సమయానికి ఎవరు రాకపోవడంతో మధ్యాహ్నం 12:30కు సామాజిక తనిఖీ ప్రారంభమైంది. రాత్రి వరకు సామాజిక తనిఖీ కొనసాగుతుండగా కొంత వేగంగా తనిఖీ ప్రక్రియ పూర్తి చేసేలా అధికారులు ప్రయత్నాలు చేశారు.

**ఓవైపు వర్షం.. మరోవైపు విద్యుత్ కోత..**

సామాజిక తనిఖీ ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మధ్యాహ్నం ప్రారంభించారు. వర్షం పడడంతో పాటు చీకటి కావడంతో ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరానికి మార్చారు. ఇదే సమయంలో విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో సాధారణ లైట్లు పెట్టుకొని తనిఖీ నిర్వహించారు. అధికారులు విషయాన్ని విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేయడంతో విద్యుత్ పునరుద్ధరించారు. ఇంత ప్రాముఖ్యత గల తనిఖీకి అధికారులు కనీస ఏర్పాట్లు కూడా చేయకపోవడంపై పలువురు అసహనం వ్యక్తం చేశారు.

# విద్యారంగం పట్ల కేంద్రం చిన్నచూపు

- అరకొర నిధుల కేటాయింపుపై
- నేడు జిల్లావ్యాప్తంగా నిరసనలకు ఎస్ఎఫ్ఐ పిలుపు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అతి తక్కువ నిధుల కేటాయింపు పట్ల భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) మండిపడింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వసాకె సాయికుమార్, చాపిలె సాయికృష్ణ ఒక ప్రకటన విడుదల చేశారు. మంగళవారం కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 3.06 శాతం నిధులు కేటాయించారని, ఈ నిధులు విద్యారంగానికి ఎటు సరిపోవని పేర్కొన్నారు. యువతకు ఉపాధి, నైపుణ్యానికి పెద్ద పీట పేరుతో కేంద్రం కార్పోరేట్ల అవసరాలను తీర్చే మానవ వనరులను తయారుచేసేందుకు కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఉన్నత విద్యను అభ్యసించేందుకు విద్యార్థులకు వడ్డీలేని రుణాలను అందించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలే ఆర్థికాభివృద్ధికి పునాది అంటున్న ప్రభుత్వం ఖాళీగా ఉన్న పోస్టులను మాత్రం భర్తీ చేయకుండా ప్రయివేట్‌ను ప్రోత్సహిస్తోందని విమర్శించారు. ఈ బడ్జెట్‌లో విద్యారంగానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ బుధవారం జిల్లావ్యాప్తంగా నిరసనలు చేపట్టనున్నట్లు వారు తెలిపారు.

**కార్పోరేట్లకు నిధులు కట్టబెట్టే బడ్జెట్ : సీఐటీయూ**

మంగళవారం పార్లమెంట్‌లో కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులకు మాటలు-కార్పోరేట్లకు నిధులు కట్టబెట్టే విధంగా ఉందని సీఐటీయూ జిల్లా జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ విమర్శించారు. రెండేళ్ల కాలంలో నిత్యావసర వస్తువుల ధరలు 97 శాతం పెరగడంతో ప్రజల కొనుగోలు శక్తి తగ్గిందని బడ్జెట్‌లో ప్రస్తావించిన కేంద్రం, వారి కొనుగోలు శక్తి పెంచేందుకు నిర్దిష్ట ప్రణాళిక ఎందుకు ప్రవేశపెట్టలేదని ప్రశ్నించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని పదేండ్ల క్రితం ఇచ్చిన హామీపై ఎలాంటి సమీక్ష లేకుండానే, మళ్లీ ఏడాదికి నాలుగు కోట్ల ఉద్యోగాలిస్తామని బడ్జెట్‌లో చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. యువతకు డిగ్రీలు అవసరం లేదని, బజ్జీలు, పకోడీలు అమ్ముకోవాలని బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీల వ్యాఖ్యలను నిజం చేసే విధంగా బడ్జెట్‌లో కేటాయింపులు ఉన్నాయని మండిపడ్డారు.

# ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రత్యేక చర్యలు

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ప్రజల ఆరోగ్య రక్షణకు పారిశుధ్యం, అంటువ్యాధుల నియంత్రణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలు, ఏపీఎంలకు అఘా కాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో ఎన్ఐఆర్‌డీపీఆర్ అసోసియేట్ ప్రొఫెసర్ రమేష్, డైరెక్టర్ ఆఫ్ సస్టైనబుల్ ఎన్విరాన్మెంట్ ప్రమోద్ డబ్రాసేతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా నియంత్రణ దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో తడిపొడి చెత్త సేకరించి కంపోస్ట్ ఎరువులు తయారు చేస్తున్నట్లు తెలిపారు. వీటి తయారీకి శిక్షణ అందజేసినట్లు వివరించారు. బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేసి ఉపయోగించే దిశగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆస్పత్రుల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. మురుగు, వర్షపు నీరు నిలువ ఉండకుండా ఎప్పటికప్పుడు తొలగించేలా అధికారులు దృష్టి సారించాలని, దోమల వృద్ధిని అరికట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు ముక్త, సుభాష్, నజీర్, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# దొంగలను పట్టుకునేందుకు మూడు పోలీసు బృందాలు

- దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌పై ఎస్పీ దిశానిర్దేశం

నవతెలంగాణ-నిర్మల్



ఇటీవల నిర్మల్ పట్టణంతో పాటు ఖానాపూర్ ఏరియాలో జరిగిన దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌ల పైన జిల్లా ఎస్పీ డా.జానకి షర్మిల నిర్మల్ పట్టణ పోలీస్ స్టేషన్‌కి వెళ్లి నిర్మల్ సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించి, వారికి దిశనిర్దేశం చేశారు. పట్టణంలో జరిగిన చైన్ స్నాచింగ్ బాధితులతో స్వయంగా జరిగిన దొంగతనం గురించి అడిగి తెలుసుకున్నారు. వారికి ధైర్యం చెప్పి చైన్ స్నాచింగ్ దొంగలను పట్టుకోవటానికి మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, పంపటం జరిగిందని వెల్లడించారు. ఈ మూడు బృందాలు డీఎస్పీ గంగారెడ్డి పర్యవేక్షణలో పరిశోధన నిర్వహిస్తున్నమని వెల్లడించారు. ప్రతి దొంగతనంపై పూర్తిగా విచారణ చేయాలని, ఆధారాలు సేకరించాలని, వాస్తవాలను నిర్ధారించాలని, పోలీస్ అధికారులకు ఆదేశించారు. పట్టుకున్న దొంగలను కోర్టులో ప్రవేశపెట్టి శిక్ష పడేలా చేయాలన్నారు. వారు జైలు నుంచి బయటకు వచ్చాక వారి కదలికలను పర్యవేక్షించాలన్నారు. దొంగతనాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, రాత్రిపూట పోలీస్ పెట్రోలింగ్ ఎక్కువగా చేయాలని, అర్ధరాత్రి, మధ్యాహ్న సమయాల్లో ఎక్కువగా పెట్రోలింగ్ చేయాలన్నారు. పెట్రోలింగ్, బ్లూకోర్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవటం చాలా ముఖ్యమని అన్నారు. బాధతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల పిటిషన్‌లకు వెంటనే స్పందించాలన్నారు. సమావేశంలో నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ అశోక్, క్రైమ్ ఇన్స్‌పెక్టర్ సురేందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రికార్డుల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

నవతెలంగాణ-లోకేశ్వరం

ఉపాధిహామీ పనులకు సంబంధించిన రికార్డుల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ సోలమన్‌రాజ్ అన్నారు. మంగళవారం లోకేశ్వరం గ్రామ పంచాయతీలో ఎంపీడీఓ సోలమన్‌రాజ్ అధ్యక్షతన ఉపాధిహామీ పనులపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో 2023-24 సంవత్సర కాలంలో చేపట్టిన పనులను, కూలీల హాజరు తదితర వివరాలను డీఆర్పీ రాజేశ్వర్ చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ సురేందర్ బాబు, ఏపీఓ జగన్, పంచాయతీ కార్యదర్శి, టీఏ, ఎఫ్ఏ, గ్రామస్తులు పాల్గొన్నారు.



## కష్టపడితేనే ఫలితం

నవతెలంగాణ-బోథ్



కష్టపడితేనే ఎన్నికల్లో గెలుపు సాధ్యమని కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు ఏలేటి అశ్విన్‌రెడ్డి అన్నారు. మంగళవారం బోథ్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. జరిగిన పార్లమెంట్ ఎన్నికల గురించి, అడిగి తెలుసుకున్నారు. అలాగే రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కష్టపడి పార్టీ అభివృద్ధికి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి, నాయకులు నల్ల శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కుర్మే మహేందర్, సీనియర్ నాయకులు మెరుగు బోజన్న, బారే నాగేందర్, చందు, కిరణ్, శేఖర్, అబ్దుల్ హసీబ్, అంజయ్య పాల్గొన్నారు.

## చదువుకు అడ్డంకిగా వాగు

- పాఠశాల తెర్చుకోక ఆరు బయట విద్యార్థులు



ఉపాధ్యాయులు రాకపోవడంతో తెరుచుకోని పాఠశాల



ఆరుబయట ఆడుకుంటున్న విద్యార్థులు

నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని అనార్ పల్లి గ్రామం వద్ద వాగుతో కరంజి వాడ, బొరిలాల్ గూడ, జన్కాపూర్ తదితర పాఠశాలల ఉపాధ్యాయులకు ఇబ్బందులు తప్పడం లేదు. మంగళవారం ఉపాధ్యాయులు పాఠశాలకు హాజరు కాలేక పోయారు. దీంతో పాఠశాల తెర్చుకోలేదు. పాఠశాల తెరుచుకొని కారణంగా విద్యార్థులు ఇండ్లలో ఉండాల్సి వచ్చింది. ఇలా వాగులో నీటి ప్రవాహం ఉన్న రోజుల్లో ఉపాధ్యాయులు వాగు దాటి వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో ఆయా గ్రామాల విద్యార్థులు ఆరు బయట ఆటపాటల్లో లీనమవుతున్నారు.

## ఘనంగా దాశరథి శతజయంతోత్సవాలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ కార్యాలయంలో మంగళవారం తెలంగాణ యోధుడు, కవి దాశరథి శతజయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా దాశరథి చిత్రపటంతో పాటు దేశ విముక్తి కోసం పోరాడిన వీరులు బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్‌ల జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, ఎఎస్ఆర్ మూర్తి, నాగేశ్వర్‌రావు, కోటేశ్వర్‌రావు, ప్రతాప్‌సింగ్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జయదేవ్ అబ్రహం, సభ్యులు అల్లి రాజయ్య, బావండ్లపల్లి నర్సయ్య పాల్గొన్నారు.

## రాయితో గాయపర్చిన వ్యక్తిపై కేసు నమోదు

నవతెలంగాణ-కెరమెరి

రాయితో గాయపర్చిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గుంపుల విజయ్ కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం నెహ్రూ నగర్ కాలనీకి చెందిన మాచర్ల మారుతి తన ఇంటి వద్ద ప్రహరీ గోడ నిర్మించుకుంటున్నాడు. అదే సమయంలో పక్కింటి మూడుగుల పిరాజీ అను వ్యక్తి అడ్డుకున్నారు. దీంతో ఇద్దరి మధ్య గొడవకు దారి తీసింది. గొడవలో పిరాజీ మారుతిని చేతితో నెట్టివేసి పక్కనే ఉన్న రాయి విసరడంతో మారుతి నుదిటికి గాయమైంది. మారుతి ఇచ్చిన పిర్యాదు మేరకు పిరాజిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఉచిత కంటి శిబిరానికి స్పందన

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని కిమ్స్ ఆసుపత్రిలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి పరీక్షా శిబిరానికి స్పందన లభించింది. శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 36 మందికి పరీక్షలు నిర్వహించగా 16 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి బెల్లంపల్లి లయన్స్ క్లబ్ సహకారంతో దశల వారీగా ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అనిత దంపతులు తెలిపారు. ప్రతి మంగళవారం నిర్వహించే ఈ ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అప్తామలజిస్ట్ వసీ, గోపి పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని 33/11కేవీ రాంపూర్ సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా బుధవారం మధ్యాహ్నం 1 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనివల్ల ఆదిలాబాద్ మండలంలోని ఖుర్షీద్ నగర్, రణదివేనగర్, సుందరయ్యనగర్, నీలనగర్, గాంధీ నగర్, ఇందిరానగర్, డాల్డా కంపెనీ ఏరియా, హరిఓంనగర్, రాంపూర్ ఇండస్ట్రియల్ ఏరియాలలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఈ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

## ఎక్స్‌పో ట్రేడ్ షోను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈ నెల 26 నుండి 28 వరకు హైదరాబాద్ ఎల్‌బీ నగర్‌లోని కేబీఆర్ కన్వెన్షన్ హాలులో నిర్వహించే ఫోటోగ్రాఫర్ల ఎక్స్‌పో ట్రేడ్ షోను విజయవంతం చేయాలని ఫోటో మరియు వీడియోగ్రాఫర్ల అసోషియేషన్ కోరింది. ఈ మేరకు మంగళవారం ట్రేడ్ షోకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఫోటో, వీడియో రంగంలో రోజురోజుకు వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆధునిక కెమెరాలు ఈ ట్రేడ్ షోలో ప్రదర్శించబడుతాయని, ఫోటో, వీడియోగ్రాఫర్లకు ఇదొక మంచి అవకాశమన్నారు. కెమెరాలతో పాటు విడి భాగాలు కూడా అందుబాటులో ఉంటాయని, అవసరమైన వారు ఈ ట్రేడ్ షోకు వచ్చి కొనుగోలు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో అసోషియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

**ఆదిలాబాద్‌టౌన్ :** కన్‌స్ట్రక్షన్ సెఫ్టీ ఆఫీసర్ ఉద్యోగానికి శిక్షణ కొరకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగేంద్ర ఆదిలాబాద్ న్యాక్ కేంద్రం ఇన్‌చార్జి ద్యావంత్ రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన అభ్యర్థులు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 27 వరకు జిల్లా న్యాక్ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ఇంటర్వ్యూలు ఉంటాయని ఎంపికైన వారికి కంపెనీలో ఉద్యోగాలు లభిస్తాయని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9866565156 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత

**ఆదిలాబాద్‌టౌన్ :** జిల్లాకు చెందిన ట్రిపుల్ ఐటీ విద్యార్థినికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా మంగళవారం ల్యాప్‌ట్యాప్‌ను అందజేశారు. బాసర ట్రిపుల్ ఐటీలో చదువుతున్న బోథ్ మండలం సొనాల గ్రామానికి చెందిన ఎస్సీ విద్యార్థిని మాన్యకు ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంజూరైన ల్యాప్‌ట్యాప్‌ను మంగళవారం కలెక్టర్ రాజర్షిషా తన క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ అధికారిణి సునీత కుమారి, సూపరింటెండెంట్ పూర్ణచందర్, సాయి పాల్గొన్నారు.

## అమెజాన్ వినియోగదారులకు ఈ ప్రైమ్ డేతో మరింత ఆనందం

నవతెలంగాణ - హైదరాబాద్



అందరూ ఎంతగానో ఆసక్తిగా వేచి చూస్తున్న ప్రైమ్ డేను అమెజాన్ ఇండియా జులై 20 మరియు 21, 2024న తీసుకువస్తోంది. గొప్ప డీల్స్, కొత్త విడుదలలు, బ్లాక్‌బస్టర్ ఎంటర్‌టైన్‌మెంట్‌లను కేవల తన వినియోగదారులకు మాత్రమే కాకుండా, దేశవ్యాప్తంగా వినియోగదారు లను సంతోషాలను అందించేందుకు కట్టుబడిన అమెజాన్ ఉద్యోగులకు కూడా అపారమైన ఆనందాన్ని అందిస్తుంది. అమెజాన్‌లో బ్యూటీ అండ్ లగ్జరీ కేటగిరీల సీనియర్ మార్కెటింగ్ మేనేజర్ షాలిని మట్టాను భేటీ అవ్వండగి. ఆమె ఇంజినీరింగ్ నుంచి కంటెంట్, సోషల్ మీడియా మార్కెటింగ్‌కి చేస్తోన్న ప్రయాణం ఆమె అభిరుచికి, అనుకూలతకు నిదర్శనం. ప్రశాంతమైన రైల్వే పట్టణం జంషెడ్‌పూర్‌లో జన్మించి, విశాఖ పట్నంలో పెరిగిన షాలిని ఐఐటి ఢిల్లీలో ఇంజనీరింగ్ డిగ్రీని, ఐఐఎం కోల్‌కత్తాలో ఎంబీఏ పూర్తి చేసుకున్నారు. ఇవి ఆమె విద్యాభ్యాసానికి గట్టి పునాదులుగా ఉన్నాయి. అయితే, ఆమె మార్గం సంప్రదాయానికి భిన్నంగా మారింది. ఇంజనీరింగ్, వ్యాపారంలో ఉన్న బలమైన నేపథ్యంతో, ఆమె కంటెంట్, సోషల్ మీడియా మార్కెటింగ్‌కు సంబంధించిన డైనమిక్ రంగాలలోకి ప్రవేశించింది.

## 2025 మొదటి త్రైమాసికం ఆర్థిక ఫలితాల్లో ఐడిబిఐ బ్యాంక్‌కి 40% లాభాలు

నవతెలంగాణ - హైదరాబాద్

ఐడిబిఐ బ్యాంక్ పనేడు ఈ ఆర్థిక సంవత్సవం (ఎఫ్‌వై25) మొదటి త్రైమాసికం (క్యూ 1) ఫలితాలను ప్రకటించింది. ఇది క్యూ 1 ఎఫ్‌వై25కి



నికర లాభం ?1,719 కోట్లుగా ఉండగా, ఇది ఏడాది నుంచి ఏడాదికి 40% బలమైన వృద్ధిని నమోదు చేసింది. నిర్వహణ లాభం 2,076 కోట్లుగా ఉంది. మొత్తం వడ్డీ రాబడి 4.18% వద్ద నమోదు కాగా, క్యూ 1-2024లో ?3,998 కోట్ల నుంచి క్యూ1-2025లో నికర వడ్డీ ఆదాయం 3,233 కోట్లుగా ఉంది. అదే విధంగా క్యూ1-2024లో 4.12%తో పోలిస్తే క్యూ1-2025లో డిపాజిట్ ధర 4.58%గా ఉంది. ఏడాది నుంచి ఏడాదికి 209 బిపిఎస్ వృద్ధితో సీఆర్ఏఆర్ 22.42% వద్ద ఉంది. ఆస్తులపై రాబడి 1.83%, ఏడాది నుంచి ఏడాదికి వృద్ధి 34 బిపిఎస్ మరియు రిటర్న్ ఆన్ ఈక్విటీ 19.87% కాగా ఏడాది నుంచి ఏడాదికి ఇది 123 బిపిఎస్ వృద్ధి చెందింది. జూన్ 30, 2023 నాటికి 0.44% నుంచి నికర ఎన్‌పీఏ 0.23% మరియు స్థూల ఎన్‌పీఏ జూన్ 30, 2023 నాటికి 5.05% నుంచి 3.87%కు చేరుకుంది.

## మౌలిక సదుపాయాలు, ఉపాధి కల్పన, ఇంధన భద్రతకు ప్రాధాన్యత

నవతెలంగాణ - హైదరాబాద్



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఉపాధి కల్పన, ఇంధన భద్రతకు ప్రాధాన్యతతో ఆర్థిక వృద్ధికి దోహదపడనుందని సిమెంట్ తయారీదారుల సంఘం (సీఎంఏ) ప్రెసిడెంట్, శ్రీ సిమెంట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ నీరజ్ అఖౌరీ తెలిపారు. ప్రపంచ అనిశ్చితులు, ద్రవ్యోల్బణం నేపథ్యంలో యూనియన్ బడ్జెట్ 2024-25 రూపాంతరం చెందిందన్నారు. 11 లక్షల కోట్ల మూలధన వ్యయం ప్రకటన, వివిధ ముఖ్యమైన ప్రాజెక్టులు, కేటాయింపుల ద్వారా భారతదేశ మౌలిక సదుపాయాలను ఆధునీకరించడానికి ప్రభుత్వ నిబద్ధతను సూచిస్తుందని తెలిపారు. ఇది నిస్సందేహంగా సిమెంట్, ఇతర నిర్మాణ సామగ్రికి డిమాండ్‌ను పెంచుతుందన్నారు. ఇది వివిధ రంగాలలో భారతదేశ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి బడ్జెట్ సమగ్ర, వ్యూహాత్మక విధానాన్ని వివరిస్తుందని తెలిపారు. సిమెంట్ పరిశ్రమ భారత ప్రభుత్వ నికర సున్నా లక్ష్యాలకు అనుగుణంగా ఉందన్నారు. 'పెర్ఫార్మ్, అచీవ్ అండ్ ట్రేడ్' మోడ్ నుంచి 'ఇండియన్ కార్బన్ మార్కెట్' మోడ్‌కి మారడానికి 'హార్డ్ టు అబేట్' పరిశ్రమల కోసం పరివర్తన రోడ్‌మ్యాప్ స్వాగతించదగిన దశ అన్నారు.

## కేంద్ర బడ్జెట్ బీమా సంస్కరణలకు ఊతం

నవతెలంగాణ - హైదరాబాద్

పాలసీ బజార్ ఇన్సూరెన్స్ బ్రోకర్స్ క్రింద ఉన్న బ్రాండ్ పాలసీ బజార్ పార్టనర్స్, సమాజంలోని వివిధ వర్గాలలో ఆర్థిక వృద్ధి, ఆవిష్కరణ, సామాజిక చేరికలను ప్రోత్సహించేందుకు అనువుగా కేంద్ర బడ్జెట్ 2024 ఉందని పీబీ పార్టనర్స్ సహ వ్యవస్థాపకుడు ధ్రువ్ సారిన్ తెలిపారు. 'సమాజంలోని అన్ని వర్గాలు ముందుకు సాగే విధానాన్ని దృష్టిలో భారత ప్రభుత్వం ఉంచుకుని రూపొందించిన కేంద్ర బడ్జెట్ 2024ని మేము అభినందిస్తున్నాము. బీమా పాలసీలను విక్రయించే వ్యక్తిగత ఏజెంట్లకు టీడీఎస్ (మూలం వద్ద మినహాయించిన పన్ను) రేట్లను 5% నుంచి 2% వరకు తగ్గించడం అనేది ప్రత్యేకంగా ప్రశంసించదగ్గ అంశం. ఎందుకంటే ఇది వారి పునర్వినియోగపరచదగిన ఆదాయాన్ని నేరుగా పెంచుతుంది' అని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్ 2024 మరింత సమగ్రమైన, సంపన్నవంతమైన భారతదేశాన్ని నిర్మించేందుకు ఒక పరివర్తనాత్మక అడుగు అని పీబీ పార్టనర్స్ విశ్వసిస్తుంది.

## నిర్మల్‌లో నకిలీ విడిభాగాలపై పియాజియో ఉక్కుపాదం

నవతెలంగాణ - హైదరాబాద్

తమ కస్టమర్ల ప్రయోజనాలను పరిరక్షించడంతో పాటుగా బ్రాండ్ చిత్తశుద్ధిని చూపే నిర్ణయాత్మక చర్యగా, పియాజియో ఇండియా నిర్మల్లో నకిలీ పియాజియో విడిభాగాల ఉత్పత్తి, పంపిణీకి వ్యతిరేకంగా భారీ స్థాయిలో చట్టపరమైన దాడులను నిర్వహించింది. వినియోగదారుల భద్రత, ఉత్పత్తి విశ్వసనీయత ప్రధాన ప్రాధాన్యతలతో, పియాజియో కఠినమైన చట్టపరమైన చర్యల ద్వారా నకిలీ విడిభాగాల సమస్యపై చురుకుగా పోరాడుతోంది. ఇటీవల నిర్మల్లో జరిగిన దాడిలో 70కి పైగా అనధికార విడిభాగాలు, ఉపకరణాలు, నకిలీ ప్యాకేజింగ్ మెటీరియల్లను స్వాధీనం చేసుకున్నారు. పియాజియో వెహికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ స్పేర్ పార్ట్స్ బిజినెస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ మలింద్ కపూర్ మాట్లాడుతూ, వినియోగదారుల భద్రతకు ప్రాధాన్యతనివ్వడమే కాకుండా తమ కార్యకలాపాల వల్ల ఎదురయ్యే సంభావ్య చట్టపరమైన పరిణామాలు గురించి నకిలీ వ్యాపారులకు గట్టి హెచ్చరిక కూడా చేస్తున్నామన్నారు. పియాజియో ఒరిజినల్ స్పేర్ పార్ట్లను అధీకృత/పంపిణీదారు /డీలర్షిప్/షాప్/రిటైలర్ నుండి మాత్రమే కొనుగోలు చేయగలరన్నారు.

## బిగ్‌బాస్ ఓటీటీ సీజన్-3లో పాల్గొన్న యూట్యూబర్ అర్మాన్ మాలిక్

నవతెలంగాణ - హైదరాబాద్

సోషల్ మీడియా సెలబ్రిటీ అర్మాన్ మాలిక్ ప్రస్తుతం అనిల్ కపూర్ హోస్ట్ చేస్తున్న బిగ్‌బాసాట్ 3లో పాల్గొంటున్నారు. మిస్టర్ షఫీ సామి ఫిట్‌నెస్‌పై పోస్టర్‌ను విడుదల చేసి మాలిక్ కుటుంబానికి ఎక్కువ ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సెషన్‌లో మిస్టర్ మాలిక్‌ను గెలిపించేందుకు వీలైనంత ఎక్కువ ఓటు వేయాలని భారతదేశ ప్రజలకు, ముఖ్యంగా హైదరాబాద్ ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

## క్రెడిట్ కార్డులతో మూవీ టిక్కెట్‌లపై ఆపర్లే ఆఫర్లు

నవతెలంగాణ - హైదరాబాద్

క్రెడిట్ కార్డులతో మూవీ టిక్కెట్‌లపై ఎన్నో ఆఫర్లు కలవని పైసాబజార్ క్రెడిట్ కార్డ్స్ హెడ్ రోహిత్ చిబ్బర్ తెలిపారు. సినీ ప్రియులకు ఈ కార్డులతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. పైసాబజార్ సిఫార్సు చేసే ఈ క్రెడిట్ కార్డులతో.. ఇకపై మూవీకి వెళ్లినప్పుడు ఉత్తేజకరమైన ప్రయోజనాలతో పాటు అధిక మొత్తంలో డబ్బును ఆదా చేసుకోవచ్చని పేర్కొన్నారు. డైరెక్ట్ డిస్కౌంట్, బై వన్ గెట్ వన్ రూపంలో అందించనున్న చలనచిత్ర ప్రయోజనాలతో కూడిన ఉత్తమ క్రెడిట్ కార్డులు కూడా ఉన్నాయన్నారు. అవి పీవీఆర్ ఐనాక్స్ కోటక్ క్రెడిట్ కార్డు, బుక్ మై షో ఆర్బీఎల్ బ్యాంకు ప్లే క్రెడిట్ కార్డు, యాక్సిస్ బ్యాంక్ మై జోన్ క్రెడిట్ కార్డు, అమెరికన్ ఎక్స్‌ప్రెస్ స్మార్ట్ ఎర్న్ క్రెడిట్ కార్డు, ఐడీఎఫ్సీ ఫస్ట్ వెల్త్ క్రెడిట్ కార్డు, యాక్సిస్ బ్యాంక్ నియో క్రెడిట్ కార్డులు కలవన్నారు. ఈ కార్డులతో అనేక ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. వారాంతంలో టిక్కెట్ల కోసం వేలల్లో ఖర్చు పెట్టే అవస్థలు నుంచి తప్పించుకోవచ్చన్నారు.

# వేతన జీవికి నిరాశే!



న్యూఢిల్లీ : బడ్జెట్‌పై వేతన జీవులు పెట్టుకున్న ఆశలను మోడీ ప్రభుత్వం అందుకోలేకపోయింది. పన్ను శ్లాబుల్లో లతో పాటు, స్టాండర్డ్ డిడక్షన్ లో చేసిన మార్పుల పట్ల ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు. ఆ చర్యల వల్ల పెద్దగా ఉపయోగం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం స్టాండర్డ్ డిడక్షన్ మొత్తం 50 వేల రూపాయలు ఉండగా, దానిని 75 వేల రూపాయలకు పెంచుతున్నట్లు బడ్జెట్‌లో ప్రతిపాదించారు. దీనివల్ల 17,500 రూపాయల వరకు ఉద్యోగులకు ఆదా అవుతుందని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. అయితే, ఉద్యోగుల్లో మాత్రం కనీసం లక్ష రూపాయల వరకు మినహాయింపు ఇచ్చి ఉండాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక

### స్వల్ప ఊరట పట్ల పెదవి విరుపు

పన్ను శ్లాబుల విషయాని కొస్తే కొత్త పన్ను విధానంలో ఉండే వారికి మూడు లక్షల రూపాయల వరకు ఎటువంటి పన్నూ ఉండదు. గతంలో 3-6 లక్షల శ్లాబులో ఉండే వారికి 5 శాతం పన్ను ఉండేది, ఇప్పుడు ఆ మొత్తాన్ని 7లక్షల రూపాయలకు పెంచారు. గతంలో 6-9 లక్షల రూపాయల శ్లాబులో ఉండేవారికి 10శాతం పన్ను ఉండగా, తాజా శ్లాబుల ప్రకారం 7-10 లక్షల రూపాయల శ్లాబులో ఉండేవారు 10 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. పాత పన్ను విధానంలో కొనసాగుతున్న వారికి ఎటువంటి మార్పులు లేవు. పెన్షనర్లకు 15 వేల రూపాయలుగా ఉన్న స్టాండర్డ్ డిడక్షన్‌ను 25 వేల రూపాయలకు పెంచారు.

**కొత్త శ్లాబులు ఇలా...**

| ఆదాయం (రూ లక్షలలో) | పన్ను (శాతం) |
|---|---|
| 0-3 | 0 |
| 3-7 | 5 |
| 7-10 | 10 |
| 10-12 | 15 |
| 12-15 | 20 |
| 15 లక్షల పైన | 30 |

# విద్యారంగానికి నిరాశే : టీపీటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి నిరాశే ఎదురైందని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వై అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పి నాగిరెడ్డి విమర్శించారు. విద్యారంగానికి కనీసం కేంద్ర బడ్జెట్‌లో కనీసం పది శాతం నిధులు కేటాయించాలంటూ విద్యాకమిషన్లు సూచించినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత బడ్జెట్‌లో విద్యకు 2.66 శాతం నిధులను కేటాయించిందని వివరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యకు తక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నదని పేర్కొన్నారు. తగిన నిధులను కేటాయించకుండా అందరికీ నాణ్యమైన విద్యను అందించడం సాధ్యం కాదని తెలిపారు. పేదలకు విద్యను దూరం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా ప్రయివేటీకరణను ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. బడ్జెట్‌లో ఆదాయపు పన్ను మినహాయింపులు పెంచకపోవడం మధ్యతరగతి వేతన జీవులకు నిరాశే మిగిలిందని తెలిపారు.

### విద్యారంగానికి ప్రాధాన్యత లేదు : డీటీఎఫ్

విద్యారంగానికి కేంద్ర బడ్జెట్‌లో ప్రాధాన్యత లేదని డీటీఎఫ్ అధ్యక్షులు ఎం సోమయ్య ప్రధాన కార్యదర్శి టి లింగారెడ్డి విమర్శించారు. ఈ బడ్జెట్‌లో విద్యకు 2.6 శాతం నిధులు కేటాయించారని తెలిపారు. తగినన్ని నిధులు కేటాయించకుండా పేద విద్యార్థులకు నాణ్యమైన, సమానమైన విద్య అందించడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. విద్యారంగాన్ని పట్టించుకోకపోవడం ద్వారా పేదలు, బలహీనవర్గాలకు అన్యాయం చేసినట్టే అవుతుందని తెలిపారు. ఆదాయపు పన్ను మినహాయింపులో వేతన జీవులకు నిరాశే మిగిలిందని పేర్కొన్నారు. పాత విధానంలోకి శ్లాబులను మార్చకుండా కొత్త విధానంలో కొంత వెసులుబాటు కల్పించడం వల్ల ఒరిగేదేమీ లేదని విమర్శించారు.

### మధుపరులకు మద్దతు ఇవ్వని బడ్జెట్ : టీఆర్టీఎఫ్

కేంద్ర బడ్జెట్‌లో వేతన జీవులకు కొంత ఊరట లభించినట్టుగా కనిపించిందని టీఆర్టీఎఫ్ అధ్యక్షులు కటకం రమేష్, ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి తెలిపారు. వేతన జీవులు పొదుపు చేసుకునే మార్గాలను పన్ను రూపంలో కేంద్రం భారం పెంచి వేతన జీవులకు నిరాశే మిగిల్చిందని పేర్కొన్నారు. స్టాండర్డ్ డిడక్షన్ రూ.75 వేలకు పెంచినా 80సీ మినహాయింపులు ఇవ్వలేదని తెలిపారు.

### ఓపీఎస్ ప్రస్తావన లేదు : టీఎస్‌సీపీఎస్‌ఈయూ

కేంద్ర బడ్జెట్‌లో పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్) ప్రస్తావనే లేదని టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఉపాధ్యక్షులు మ్యాన పవన్‌కుమార్ తెలిపారు. సీపీఎస్ రద్దు గురించి ప్రస్తావన లేకపోవడం ఉద్యోగులు, ఉపాధ్యాయులను నిరాశపర్చిందని పేర్కొన్నారు. ఈ బడ్జెట్‌లో వేతన జీవులకు అన్యాయం జరిగిందని తెలిపారు. పాత పన్ను విధానంలో కూడా రూ.ఏడు లక్షల వరకు పన్ను లేకుండా మినహాయింపునివ్వాలని డిమాండ్ చేశారు. స్టాండర్డ్ డిడక్షన్ రూ.లక్ష వరకు పెంచాలని కోరారు.

## నిటి ఆయోగ్‌కు సీఎంలు బాయ్‌కాట్

- 'వివక్షపూరిత' బడ్జెట్ అంటూ నలుగురు ముఖ్యమంత్రుల ఆగ్రహం

న్యూఢిల్లీ : కేంద్రబడ్జెట్ వివక్షపూరితమైనదంటూ..27న జరగాల్సిన నిటి ఆయోగ్ సమావేశాన్ని బాయ్‌కాట్ చేస్తామంటూ నలుగురు ముఖ్యమంత్రులు ప్రకటించారు. వీరిలో తమిళనాడు సీఎం ఎంకె స్టాలిన్, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, కర్నాటకకు చెందిన సిద్ధరామయ్య, హిమాచల్ ప్రదేశ్‌కి చెందిన సుఖ్వీందర్ సింగ్ సుఖు ఉన్నారు. "ఈ బడ్జెట్ వివక్షాపూరితమైనది. ప్రమాదకరమైనది. ఇది పూర్తిగా సమాఖ్యస్ఫూర్తికి విరుద్ధంగా ఉంది. కేంద్ర ప్రభుత్వం తప్పనిసరిగా అనుసరించాల్సిన ఫెడరలిజం , న్యాయమైన సూత్రాలకు భిన్నంగా ఉన్నది. అని నలుగురు సీఎంలు ప్రకటించారు.

## జమ్మూకాశ్మీర్ వార్తాపత్రిక యజమానికి ఊరట

- తరుణ్ బెహ్లాకు సుప్రీంకోర్టు బెయిల్

న్యూఢిల్లీ : అధికార రహస్యాల చట్టం కింద ఈ నెల ప్రారంభంలో అరెస్టయిన జమ్మూకు చెందిన వ్యాపారవేత్త, వార్తాపత్రిక యజమాని తరుణ్ బెహ్లాకు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. కొన్ని షరతులతో ఈ బెయిల్ మంజూరు చేసింది. తనపై కేసు గురించి ఎలాంటి ఇంటర్వ్యూ కానీ, వార్తను కానీ తరుణ్ ప్రచురించకూడదని సుప్రీంకోర్టు షరతు విధించింది. అనుమతి లేకుండా జమ్ముకాశ్మీర్ విడిచివెళ్లకూడదనే షరతు కూడా విధించింది. తరుణ్ బెహ్లా రెగ్యులర్ బెయిల్ పిటీషన్‌ను ఆగస్టు 9కు వాయిదా వేసింది. అలాగే, 'కేసు దర్యాప్తును ప్రారంభించిన దగ్గర నుంచే నిందితుడ్ని దోషిగా చిత్రీకరించకూడదు. కేసు విచారణలో ఉన్న సమయంలోనే కేసుకు సంబంధించిన సాక్ష్యాధారాలను పోలీసులు వెల్లడించాలి. నిందితుడ్ని లేదా అనుమానితున్ని నిర్బంధించకూడదు. దీని వలన నిందితుడు జైలు శిక్షను అనుభవిస్తుంటాడు, కానీ దర్యాప్తు నిజమైన ప్రయోజనం నెరవేరదు' అని జస్టిస్ రాహుల్ భర్తి నేతృత్వంలోని ధర్మాసనం తన బెయిల్ తీర్పులో పేర్కొంది.

భద్రత ఉపసంహరించుకున్న వ్యక్తుల జాబితాను ప్రచురించినందుకు ఈ నెల 10న జమ్మూ నగరంలోని అతని నివాసం నుంచి తరుణ్ బెహ్లాను పోలీసులు అరెస్టు చేశారు. అతనికి చెందిన నివాసాల్లోనూ పోలీసులు సోదాలు నిర్వహించారు.

## ఉపాధి, నైపుణ్యం కోసం

# ప్రధానమంత్రి ప్యాకేజీ




న్యూఢిల్లీ : ఈపీఎఫ్ఓలో తొలిసారిగా నమోదైన ఉద్యోగులు ప్రభుత్వం నుండి మొదటి నెలలో రూ.15,000 వరకూ అదనపు జీతం పొందుతారు. 'ప్రైమ్ మినిస్టర్ ప్యాకేజ్ ఫర్ ఎంప్లాయిమెంట్ అండ్ స్కిల్లింగ్' పథకంలో భాగంగా ఈపీఎఫ్ఓలో తొలిసారి పేరు నమోదు చేసుకున్న ఉద్యోగులకు ఒక నెల జీతం అదనంగా అందిస్తామని ఆర్థిక మంత్రి తెలిపారు. ఈ మొత్తాన్ని మూడు వాయిదాల్లో ఉద్యోగి బ్యాంక్ ఖాతాలో నేరుగా జమ చేస్తామని చెప్పారు. ఉపాధి, నైపుణ్యం, ఎంఎస్ఎంఈలు, మధ్య తరగతి ప్రజలపై బడ్జెట్ దృష్టి సారించిందని ఆమె తెలిపారు. రాబోయే ఐదు సంవత్సరాల కాలంలో ఈ ప్యాకేజీ కింద 4.1 కోట్ల మంది యువతకు ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి, ఇతర అవకాశాలు కల్పిస్తామని వివరించారు. ఇందుకోసం రెండు లక్షల కోట్ల రూపాయలు కేటాయించామని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో విద్య, ఉపాధి, నైపుణ్య చర్యల కోసం రూ.1.48 లక్షల కోట్లు అందజేస్తామని అన్నారు.

ఈ ప్యాకేజీలోని ఐదు పథకాల్లో మూడింటికి 'ఉపాధి ఆధారిత ప్రోత్సాహకం' (ఈఎల్ఐ) అని పేరు పెట్టామని, తొలిసారి ఉద్యోగి అయ్యే వారికి దీని కింద నెల జీతం అందిస్తామని తెలిపారు. తయారీ రంగంలో ఉపాధి కల్పనకు మరో పథకాన్ని ఉద్దేశించామని, ఉద్యోగితో పాటు యజమానికి కూడా వారి ఈపీఎఫ్ఓ కంట్రిబ్యూషన్ ఆధారంగా ప్రోత్సాహకాలు అందిస్తామని చెప్పారు. ఉద్యోగం వచ్చిన మొదటి నాలుగు సంవత్సరాల వరకూ ఇది అమలులో ఉంటుందని అన్నారు.

మూడవ పథకంలో యజమానులకు అవసరమైన మద్దతు అందిస్తామని నిర్మల తెలిపారు. ప్రతి అదనపు ఉద్యోగి కోసం ఈపీఎఫ్ఓ కంట్రిబ్యూషన్ కింద చెల్లించే వాటాలో రెండు సంవత్సరాల పాటు నెలకు రూ.3,000 చొప్పున రీయంబర్స్‌మెంట్ చేస్తామని చెప్పారు. నాలుగో పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశ్రమ సహకారంతో నైపుణ్యాభివృద్ధికి చర్యలు చేపడతామని అన్నారు. దీనికింద రాబోయే ఐదు సంవత్సరాల్లో 20 లక్షల మంది యువతకు శిక్షణ ఇస్తామని చెప్పారు. ప్రధానమంత్రి ప్యాకేజీలో చివరి పథకంలో భాగంగా ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పిస్తామని, రాబోయే ఐదు సంవత్సరాల్లో ఐదు వందల ప్రముఖ కంపెనీల్లో కోటి మందికి ఇంటర్న్‌షిప్ ఇస్తామని వివరించారు.

### వ్యవసాయానికి రూ.1.52 లక్షల కోట్లు

వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు బడ్జెట్‌లో రూ.1.52 లక్షల కోట్లు కేటాయించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకొని, అధిక దిగుబడిని అందించే 109 నూతన వంగడాలను విడుదల చేస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించారు. అవసరాన్ని బట్టి పది వేల బయో-ఇన్‌పుట్ రిసోర్స్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, వాటికి కేంద్రం చేయూత అందిస్తుందని చెప్పారు. సవరించిన అంచనాల ప్రకారం వ్యవసాయ మంత్రిత్వ శాఖకు రూ.1,16,788.96 కోట్లు కేటాయించారు.

### ఐటీ చట్టంపై సమగ్ర సమీక్ష

ఐటీ చట్టంపై సమగ్ర సమీక్ష జరుపుతామని నిర్మలా సీతారామన్ చెప్పారు. అందరూ అర్థమయ్యేలా చదువుకునేందుకు, వ్యాజ్యాల సంఖ్యను తగ్గించేందుకు ఈ సమీక్ష అవసరమని అన్నారు. స్టార్టప్ కంపెనీలకు ఊతమిచ్చేందుకు ఏంజెల్ పన్నును రద్దు చేస్తామని ఆమె ప్రతిపాదించారు. విదేశీ కంపెనీలపై కార్పొరేట్ పన్ను రేటును 40% నుండి 35%కి తగ్గిస్తామని తెలిపారు.

బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిషా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సమగ్రాభివృద్ధి కోసం 'పూర్వోదయ' పథకాన్ని చేపడతామని ఆర్థిక మంత్రి చెప్పారు. బడ్జెట్‌లో మూలధనపు వ్యయ లక్ష్యాన్ని రూ.11.11 లక్షల కోట్లుగా చూపారు.

### విద్యుత్‌కు అధిక ప్రాధాన్యం

బడ్జెట్‌లో విద్యుత్ రంగానికి కేంద్రం అధిక ప్రాధాన్యత ఇచ్చింది. దేశంలో కోటి కుటుంబాలు నెలకు 300 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ పొందేందుకు వీలుగా 'పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' కింద ఇంటి పైకప్పులపై సౌర ఫలకాలను ఏర్పాటు చేస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించారు. ఉచిత సౌర విద్యుత్ వినియోగం కారణంగా కుటుంబాలు ఏటా రూ.15,000-18,000 కోట్లు ఆదా చేసుకోగలుగుతాయని, మిగులు విద్యుత్‌ను పంపిణీ కంపెనీలకు విక్రయించుకోవచ్చునని తెలిపారు. 2030 నాటికి శిలాజేతర ఇంధన వనరుల నుండి 50 జీడబ్ల్యు పునరుద్పాదక ఇంధనాన్ని, విద్యుదుత్పత్తి స్థాపక సామర్థ్యంలో యాభై శాతాన్ని పొందాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని వివరించారు. ఈ బడ్జెట్‌లో విద్యుత్ మంత్రిత్వ శాఖకు రూ.20,502 కోట్లు కేటాయించారు. గత ఆర్థిక సంవత్సరంలో ఈ మంత్రిత్వ శాఖ బడ్జెటరీ వ్యయం రూ.20,671.32 కోట్లు.

## ఎన్డీఏను కాపాడుకునేందుకే ఈ బడ్జెట్

- ఎంపీ మల్లు రవి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రంలోని ఎన్డీయే సర్కార్‌ను కాపాడుకునేందుకు పెట్టిన బడ్జెట్‌గా మోడీ బడ్జెట్ ఉందని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి విమర్శించారు. ఈ దిశలో ఎన్డీయేలో కీలక భాగస్వాములుగా ఉన్న ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాల కోసమే బడ్జెట్ పెట్టినట్టు ఉందన్నారు. వాళ్ళ ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకే ఈ రెండు రాష్ట్రాలకు కేటాయిం పులు చేశారని ఆరోపించారు. బడ్జెట్ ప్రసంగం అనంతరం ఢిల్లీ తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, గడ్డం వంశీకృష్ణ, కడియం కావ్య, బలరాం నాయక్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మల్లు రవి మాట్లాడుతూ... నిర్మలా సీతారామన్ బడ్జెట్ తీవ్ర నిరాశకు గురిచేసిందని అన్నారు. విభజన చట్టం గురించి చాలాసార్లు ప్రస్తావించినా తెలంగాణ అన్న పదం వాడకపోవడం శోచనీయమన్నారు. అలాగే విభజన చట్టంలో తెలంగాణకు ఇచ్చిన హామీల ప్రస్తావన లేకపోవడం దారుణమని తెలిపారు. హైదరాబాద్ మినహా 9 జిల్లాలు వెనుకబడిన జిల్లాలుగా గుర్తించినప్పటికీ... తెలంగాణకు ప్రత్యేక కేటాయింపులు లేవని, ఈ విషయంలో కేంద్ర వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు నిధుల కేటాయింపు లో తమకు అభ్యంతరం లేదని, కానీ తెలంగాణకు కేటాయింపులు లేకపోవడం బాధాకరమని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి పూర్తి చేయాలని నేరుగా సీఎం ప్రధాని, కేంద్ర మంత్రులకు రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని తెలిపారు. తెలంగాణ నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు గెలిచారని, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా... తెలంగాణకు దక్కింది శూన్యమని ఎద్దేవా చేశారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై బీజేపీ ఎంపీలు రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణపై కేంద్రం చూపిస్తోన్న వైఖరిని నిరసిస్తూ... వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా తెలంగాణ హక్కుల సాధనకు అన్ని పార్టీల ఎంపీలంతా కలిసికట్టుగా పోరాడేందుకు ముందుకు రావాలని సూచించారు. బీజేపీ, ఎంఐఎం ఎంపీలను కలిసి ఉమ్మడి పోరాటంపై చర్చిస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నేతత్వంలో తెలంగాణ హక్కుల సాధనకు అలుపెరుగని పోరాటం చేస్తామన్నారు.

### తెలంగాణ మోడీ మొండిచేయి... ఎంపీ కడియం కావ్య

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి ప్రధాని మోడీ మొండిచేయి చూపించారని వరంగల్ ఎంపీ కడియం కావ్య ఫైర్ అయ్యారు. తెలంగాణ ఏర్పాటునే ఓర్వలేని మోడీ, రాష్ట్రానికి నిధులు కేటాయించడంలోనూ కపటప్రేమ చూపారని విమర్శించారు. నిధులు లేక ఆర్థిక ఇబ్బందుల్లో రాష్ట్రం ఉందని.. ఈ టైంలో కేంద్ర బడ్జెట్ కొంత ఉపశమనం కలిగిస్తుందని భావించినట్టు చెప్పారు. కానీ మరోసారి కేంద్ర ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర నిరాశే ఎదురైందని దుయ్యబట్టారు.

### బీజేపీ ఎంపీలను ఘెరావ్ చేయాలి : ఎంపీ బలరాం నాయక్

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశాక రాష్ట్ర ప్రజలకు బీజేపీ ఎంపీలు ఎలా మొఖం చూపిస్తారని ఎంపీ బలరాం నాయక్ ప్రశ్నించారు. రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు సాధించడంలో విఫలమైన బీజేపీ ఎంపీలను ప్రజలు ఘెరావ్ చేయాలని పిలుపునిచ్చారు. బడ్జెట్‌లో సరైన నిధులకు కృషి చేయని కేంద్రమంత్రి పదవులు ఎందుకు? అని నిలదీశారు. తెలంగాణ ప్రజలపై ఎన్డీయే సర్కార్ చిన్నచూపు చూపించడం బాధాకరమన్నారు.

## కనీసం 18 రోజులైనా నిర్వహించాలని కోరాం

- నాలుగైదు రోజులు సభను నడిపి మమ అనిపించే ప్రయత్నం : ఏలేటి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర బడ్జెట్ సమావేశాలను కనీసం 18 రోజులైనా నిర్వహించాలని బీఏసీ సమావేశంలో కోరామని బీజేపీ ఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చెప్పారు. మంగళవారం అసెంబ్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం నాలుగైదు రోజులు సమావేశాలు నిర్వహించి మమ అనిపించే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. వ్యవసాయం, సాగునీటి రంగం, ఉద్యోగ నోటిఫికేషన్లు-ఉపాధి, మహిళకిచ్చిన హామీలు, విద్యారంగం, పంచాయతీరాజ్ సమస్యలు, ఎస్సీ,ఎస్టీలకిచ్చిన హామీల అమలు-వర్గీకరణ, పౌరసరఫరాల శాఖలో అవినీతి అక్రమాలు, గృహ నిర్మాణ శాఖ - ఇచ్చిన హామీలు, పింఛన్లు, భూమి, విద్యుత్, ఎక్సైజ్, బీసీ సంక్షేమం, వైద్యారోగ్యం, ఆటోడ్రైవర్లను ఆదుకుంటామనే హామీ, ప్రజాదర్బారు నిర్వహణ, చేనేత, ఇలా ఒక్కో అంశంపై కనీసం ఒక రోజు సమయం కేటాయించి చర్చిస్తే బాగుంటుందని బీఏసీకి సూచించామన్నారు.

## ప్రాధాన్యతాంశంగా తెలంగాణ ఫ్యూచరిస్టిక్ ఎక్స్ పీరియన్స్ కేంద్రం

- ఐటీ పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ఫ్యూచరిస్టిక్ ఎక్స్ పీరియన్స్ కేంద్రం ఏర్పాటును ప్రాధాన్యతాంశంగా పరిశీలిస్తున్నట్టు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఫ్యూచరిస్టిక్ కేంద్రంపై పలువురు పారిశ్రామికవేత్తలిచ్చిన ప్రజెంటేషన్‌ను మంత్రి తిలకించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవిష్కరణకు ఖర్చయ్యే రూ.500 కోట్ల నిధులను సమకూర్చేందుకు ఏదైనా వాణిజ్య సంస్థ ముందుకొస్తే ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తుందని తెలిపారు. భారీ మాల్ తరహాలో ఉండే ఈ కేంద్రంలో సమావేశ మందిరాలు, తెలంగాణ చరిత్ర, సాధించిన అభివృద్ధి, భవిష్యత్తు గమ్యాల గురించి అవగాహన కల్పించే విభాగాలుంటాయని వెల్లడించారు. పర్యాటకులను విశేషంగా ఆకర్షించేలా ఈ కేంద్రాన్ని నిర్మించనున్నట్టు తెలిపారు.

## పర్యాటకరంగ అభివృద్ధికి చర్యలు

- తెలంగాణ టూరిజం చైర్మెన్ పటేల్ రమేష్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు చేపట్టామని తెలంగాణ టూరిజం కార్పొరేషన్ (టీజీటీడీసీ) చైర్మెన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని బేగంపేటలో ట్రావెల్ ఏజెంట్లు, భూటాన్ పర్యాటక శాఖ ప్రతినిధులతో ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణను దేశంలోనే అత్యధిక టూరిస్టులు కోరుకునే పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దనున్నట్టు తెలిపారు. ట్రావెల్ ఏజెంట్లు, టూర్ ఆపరేటర్లు కొత్త ఆలోచనలతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. టీజీటీడీసీ ఎండీ ఎన్.ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రారంభంలో ఇన్‌బౌండ్, అవుట్‌బౌండ్ టూర్ ప్యాకేజీలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. భూటాన్ టూరిజంతో ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఆపరేటర్లు తమ పర్యాటకాన్ని విస్తరించవచ్చని అభిప్రాయపడ్డారు. భూటాన్ మాజీ విద్యాశాఖ మంత్రి ఠాకూర్ పొడ్యేల్ మాట్లాడుతూ తమ దేశంలోని సహజ, సాంస్కృతిక ప్రాంతాలు టూరిస్టులను కట్టిపడేస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ, భూటాన్‌లు దేశీయ, అంతర్జాతీయ కార్యకలాపాలను నిర్వహించడానికి పరస్పర అంగీకార అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు

## రైతు రుణమాఫీపై బీజేపీ తప్పుడు ప్రచారం

- ఎమ్మెల్యే వంశీకృష్ణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రైతు రుణమాఫీపై బీజేపీ ఎమ్మెల్యేలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే వంశీకృష్ణ విమర్శించారు. మంగళవారం శాసన సభ మీడియా పాయింట్‌లో షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా మూడు విడుతల్లో రైతు రుణమాఫీని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్నదని చెప్పారు. రేషన్ కార్డుకు ఏమాత్రం సంబంధం లేదు. పట్టా పాస్ బుక్ ఇందుకు ప్రాతిపదికని చెప్పారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో రైతు రుణ మాఫీపై బీజేపీ వారు ఒక్కసారైనా మాట్లాడారా? అని నిలదీశారు. రూ. 31 వేల కోట్లు రుణ మాఫీ చేసిన ముఖ్యమంత్రి దేశ చరిత్రలో ఎవరూ లేరని చెప్పారు. తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలువనున్నదన్నారు.